# దివాళా తీసిన యుపి పవర్ ట్రాన్స్‌మిషన్ కంపెనీ

**హైదరాబాద్, అక్టోబరు 25, ప్రభాతవార్త:** సౌత్ ఈస్ట్ యూపీ పవర్ ట్రాన్సి మిషన్ కంపెనీ (ఎస్ఈయూపీపీటీసీఎల్) దివాళా తీసింది. ఈ నేపథ్యంలో పరిష్కార ప్రణాళిక ప్రకారం వన్‌టమ్ సెటిల్‌మెంట్ కింద ఎస్ఈయూపీపీటీసీఎల్‌ను రిసర్జంట్ పవర్ వెంచర్స్ సంస్థ చేజిక్కించుకుంది. సౌత్ ఈస్ట్ యూపీ పవర్ ట్రాన్సి మిషన్ కంపెనీకి సంబంధించి ఈ ఏడాది జూన్‌లో నేషనల్ కంపెనీ లా ట్రైబ్యునల్, అలహాబాద్ పేర్కొన్న పరిష్కార ప్రణాళిక మేరకు రిసర్జంట్ పవర్ వెంచర్స్ సంస్థ కొనుగోలు చేసింది. ఇందులో భాగంగా 3,251 కోట్ల రూపాయలతో ఎస్ఈయూపీపీటీసీఎల్ ఈక్విటీ షేర్లను రిసర్జంట్ సంస్థ కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో వాటాదార్ల నుండి నిధులను సమీకరించడంతోపాటు, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నుండి రుణాలను సమీకరించడం ద్వారా దివాళా తీసిన యూపి పవర్ ట్రాన్స్‌మిషన్ కంపెనీని కొనుగోలు చేసింది.




# తెలంగాణ పథకాలను కర్ణాటకలో అమలు చేయాలి

- మంత్రులు కెటిఆర్, శ్రీనివాస్‌గౌడ్‌లను కలిసిన శ్రీనారాయణగురు శక్తిపీఠం అధిపతి డాక్టర్ ప్రణవానందస్వామి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, అక్టోబరు 25:** కర్ణాటక గీత కార్మికుల పక్షాన సానుకూలంగా స్పందించనందుకు రాష్ట్ర మంత్రులు కెటిఆర్, శ్రీనివాస్‌గౌడ్‌కు శ్రీనారా యణ గురు శక్తిపీఠం పీఠాధిపతులు, ఆర్య, ఈడిగ రాష్ట్రీయ మహామండలి జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ప్రణవానంద స్వామి కృతజ్ఞతలు తెలిపారు. కర్ణాటకలో బిజెపి ప్రభుత్వం కల్లును నిషేధించి గీత కార్మికుల ఉపాధిని, ఆత్మగౌరవాన్ని కించపరిచేలా వృత్తిపై నిషేదం విధించిడంపై తెలంగాణ రాష్ట్ర అబ్కారీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి కెటిఆర్ పలు వేదికలపై బిజెపి ప్రభుత్వ తీరును ఎండగట్టినందుకు, గీత కార్మికుల పక్షాన సానుకూలంగా స్పందించినందుకు కర్ణాటక గీత కార్మికుల పక్షాన పోరాటం చేస్తున్న ప్రాణవానంద స్వామి మంగళవారం హైదరాబాద్‌లోని కెటిఆర్ క్యాంప్ కార్యాలయంలో మంత్రులను కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. గీత కార్మికుల సంక్షేమం, అభివృద్ధి కోసం తెలంగాణ ప్రభుత్వం ముఖ్యమంత్రి కెసిఆర్ నేతృత్వంలో అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు కర్ణాటక రాష్ట్రంలో అమలు చేయాలని ఆ రాష్ట్ర బిజెపి ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. బిజెపి పాలిత రాష్ట్రాలలో కులవృత్తులను, చేతి వృత్తులను నిర్వీర్యం చేసి వెనుకబడిన వర్గాలకు చెందిన ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని మంత్రులకు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గౌడం సంఘం అధ్యక్షుడు పల్లె లక్ష్మణ్‌రావుగౌడ్, ప్రధాన కార్యదర్శి ప్రశాంత్‌గౌడ్ అఃల భారత గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కూరెళ్ల వేములయ్య గౌడ్ తదితరులు ఉన్నారు.

### బిజెపి ప్రాంతాల్లో కులవృత్తుల పరిస్థితి దయనీయం

బిజెపి పాలిత రాష్ట్రాల్లో కుల వృత్తుల పరిస్థితి దయ నీయంగా ఉందని నారాయణగురు శక్తిపీఠం అధిపతి డాక్టర్ ప్రణవా నంద స్వామి మండిపడ్డారు. ఈ మేరకు మంగళవారం తెలంగాణ గౌడ సంఘాల జేపీసీ చైర్మన్ పల్లె లక్ష్మణ్‌రావుగౌడ్, కోచైర్మన్ కూరెళ్ల వేములయ్యగౌడ్ ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన కర్ణాటక-తెలంగాణ రాష్ట్ర గౌడ సంఘాల సమావేశానికి ఆయన ముఖ్యఅతిధిగా హాజరై మాట్లాడుతూ దేశంలోని బిజెపి పాలిత రాష్ట్రాల్లో కల్లును నిషేధించడంతో ఆ వృత్తిపై ఆధారపడిన కుటుంబాలు రోడ్డున పడ్డా యని ఆవేదన వ్యక్తం చేశారు. మేకిన్ ఇండియా మేడిన్ ఇండియా అని చెబుతున్న బిజెపి ప్రభుత్వానికి దేశంలోని కులవృత్తులు కనిపించడం లేదా అని మండిపడ్డారు. దేశంలోని దాదాపు 70 లక్షల మంది వివిధ కులవృత్తుల వారు బిజెపి ప్రభుత్వ తీరుతో తీవ్రకష్టాలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అదే సమయంలో తెలం గాణలో గౌడ సామాజిక వర్గం ఎదు ర్కొంటున్న సమస్యలను పరిష్కరిం చడంతోపాటు వారి అభ్యున్నతికి తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న కృషి హార్షణీయమన్నారు. కర్ణాటక ప్రభు త్వ తీర్పునకు వ్యతిరేకంగా 2004 నుంచి తాను పోరాటం చేస్తున్నా అక్కడ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. జాతీయ



పార్టీలగా అవతరించిన బిఆర్ఎస్, కలిసివచ్చే వారిని కలుపుకుని తమ నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

జనవరి 6న మంగళూరు టు బెంగళూరు యాత్రకు శ్రీకారం చుట్టినట్లు ఆయన పేర్కొన్నారు. దేశంలోని గౌడ సామాజిక వర్గానికి చెందిన ప్రజలు ఎదు ర్కొంటున్న సమస్యల కోసం తామంతా కలిసి పనిచేస్తామని గౌడ సంఘాల జేఏసీ అధ్యక్షులు పల్లె లక్ష్మణ్‌రావుగౌడ్ తెలిపారు. టిఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలోని గౌడ జాతి అభివృద్ధికి అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘాల నాయకులు ప్రశాంత్‌గౌడ్, లింగంగౌడ్, సంజయ్‌గౌడ్, ధనుంజయ్‌గౌడ్, ఆనంద్‌గౌడ్, రవిందర్‌గౌడ్, ధనుంజయ్‌గౌడ్, సిహెచ్. సుదర్శన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# మునుగోడులో బిజెపిని ఓడించాలి

## డబ్బు, అధికారం అండతో గెలవాలని చూస్తోంది

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

**హైదరాబాద్, అక్టోబరు 25, ప్రభాతవార్త:** నవంబర్ 3న జరగనున్న మునుగోడు శాసనసభ ఉప ఎన్నికలో భారతీయ జనతా పార్టీ(బీజేపీ)ని ఓడించాలని సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. దేశానికి ప్రథమ శత్రువు బీజేపీ అని.. అందుకే మనుగోడులో బీజేపీని ఓడించాలన్నారు. డబ్బు, అధికారం అండతో మునుగోడు ఉప ఎన్నికలో గెలవ వచ్చనే ధీమాతో తెలంగాణలో ప్రజాస్వామ్యాన్ని అపహాస్య చేసే విధంగా వ్యవహారిస్తోందన్నారు. సీపీఐ జాతీయ కార్యదర్శి అజీజ్ పాష, కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డితోపాటు మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు పశ్యపద్మతో కలిసి సాంబశివరావు మంగళవారం ముగ్ధూమ్ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి గతంలో తనను గెలిపించిన ఓటర్లను, ఆయన కుటుంబానికి ఎన్నో పదవులు ఇచ్చిన పార్టీని ఎన్నికల్లో మద్ధతిచ్చిన కమ్యూనిస్టు పార్టీని మోసం చేశారని విమర్శించారు. ఒక పార్టీలో ఉంటూ మరో పార్టీ నుంచి పోటీ చేస్తున్న తన తమ్మునికి ఓటు వేయాలని చెబుతున్న ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిది ఏమీ నైతికత అని ప్రశ్నించారు. నల్గొండలో ఇద్దరు మోసగాళ్లు ఎవరంటే కోమటిరెడ్డి బ్రదర్స్ అంటున్నారని విమర్శించారు. బ్రిటిష్ దేశానికి భారతీయ మూలాలు కలిగిఉన్న రుషిసునాక్ ప్రధానమంత్రి అవుతుండటం పల్ల శుభాకాంక్షలు తెలిపారు. బ్రిటన్ ప్రధానిగా తాను చేసిన వాగ్ధానాన్ని నెరవేర్చనందుకు 45 రోజుల్లోనే తన పదవికి లిజ్ ట్రస్ రాజీనామా చేశారని కూనంనేని గుర్తు చేశారు.

కానీ 8 సంవత్స రాలల్లో అన్ని రంగాల్లో విఫలమైన ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఇంకా కొనసాగుతున్నారని విమర్శించారు. నిరుద్యోగం, ధరలు విపరీతంగా పెరిగిపోయాయని, శ్రీలంకను మించిన దుర్భర ఆర్థిక పరిస్థితులు భారతదేశంలో నెలకొన్నాయన్నారు. అయినప్పటికీ మందిర్, మసీదు అంటే విద్వేషాలు రెచ్చగొడుతూ వైఫల్యాలను కప్పిపుచ్చుకుం టున్నారని కూనంనేని సాంబశివరావు విమర్శించారు. మునుగోడులో బీజేపీని ఓడించి టీఆర్ఎస్ అభయర్థిని గెలిపించాలి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఎన్నికల్లో డబ్బును నిరోధించడంతోపాటు ఫిరాయింపులను నిరోధించడంఓ ఎన్నికల సంఘం పూర్తిగా విఫలమైందన్నారు. ఎన్నికల్లో డబ్బును పంచే అభ్యర్థులను శాశ్వతంగా పోటీ చేయకుండా ఎన్నికల చట్టాల్లో మార్పులు తీసుకురావల్సిన అవసరం ఉందన్నారు. భారతదేశంలో 2014 నుంచి 2019 వరకు విద్వేష ప్రసంగాలు 500 శాతం పెరిగినట్టు ఒక మీడియా సంస్థ సర్వేలో తేలిందని సయ్యద్ అజీజ్ పాషా తెలిపారు. ఎనిమిదేళ్లల్లో ఏపీ పునర్విభజన హామీల్లో ఏ ఒక్కటి కూడా బీజేపీ ప్రభుత్వం నెరవేర్చలేదని మాజీ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి విమర్శించారు. మోడీ హయాంలో ప్రజల కొనుగోలు శక్తి తగ్గిందన్నారు. నిరుద్యోగం పెరగడంతోపాటు, ధరలు విపరీతంగా పెరిగాయన్నారు. కేంద్ర బలగాలను దుర్వినియోగం చేసేందుకు బీజేపీ చేస్తున్న ప్రయత్నాలను ఓటర్లు తిప్పికొడతారని చాడ అన్నారు.

# ప్రైవేటు ఏజెన్సీలకు ధాన్యం సేకరణ

**హైదరాబాద్, అక్టోబరు 25, ప్రభాతవార్త:** ప్రస్తుత ఖరీఫ్ మార్కెటింగ్ సీజనులో దేశ వ్యాప్తంగా వరి ధాన్యం కొనుగోళ్లలో ప్రైవేటు ఏజెన్సీలు ప్రవేశించనున్నాయి. దీనికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. భారత ఆహార సంస్థ (ఎఫ్‌సిఐ), రాష్ట్ర ప్రభుత్వాల ఏజెన్సీలైన పౌరసరఫరాలు, మార్క్‌ఫెడ్‌తోపాటు, వరి సేకరణ కోసం ప్రైవేటు కంపెనీలను నియమించాలని కేంద్రం ఇటీవల ప్రతిపాదించింది. తెలంగాణలో ప్రస్తుత వానాకాలం (ఖరీఫ్) సీజనుకు సంబంధించి త్వరలో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం కానున్నాయి.

ఈ వానాకాలం సీజనులో అత్యధికంగా 65 లక్షల ఎకరాల్లో వరి పంట సాగు కాగా, తద్వారా 1.7 కోట్ల టన్నుల మేర ధాన్యం దిగుబడి అవుతుందని అంచనా. అయితే ప్రైవేటు ఏజెన్సీల ఏర్పాటు నిర్ణయం కారణంగా కేంద్రం, తెలంగాణ ప్రభుత్వం మధ్య మరో కొత్త వివాదం ఏర్పడే అవకాశాలు కన్పిస్తున్నాయి. ఇప్పటికే రబీ (వానాకాలం) సీజనులో ముడి బియ్యాన్ని కొనుగోలు చేస్తామని చెప్పిన కేంద్ర ప్రభుత్వం తెలంగాణ నుండి బాయిల్డ్ రైస్‌ను తీసుకునేందుకు మాత్రం నిరాకరించింది. రాష్ట్రంలో రబీలో బాయిల్డ్ రైస్ ఎక్కువగా ఉత్పత్తి అవుతాయి. ఈ విషయమై కేంద్ర, తెలంగాణ ప్రభుత్వాల మధ్య విబేధాలు తారాస్థాయికి చేరుకున్న నేపథ్యంలో ఇప్పుడు ధాన్యం కొనుగోళ్లలో ప్రైవేటు ఏజెన్సీలకు అవకాశం కల్పించాలనే ప్రతిపాదనతో మరోసారి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య వివాదం ఏర్పడే పరిస్థితులు ఉత్పన్నం కానున్నాయి.



కీసరగుట్ట శ్రీభవాని రామలింగేశ్వరస్వామిని దర్శించుకున్న గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ దంపతులు

# కీసరగుట్ట రామలింగేశ్వరస్వామిని దర్శించుకున్న గవర్నర్ తమిళిసై

### సత్కరించి, సన్మానించిన కీసరగుట్ట ట్రస్ట్, పూజారులు

**కీసర, అక్టోబరు 25, ప్రభాతవార్త:** దీపావళి పండుగ పర్వదినాన్ని పుర స్కరించుకుని కీసరగుట్ట శ్రీ భవాని రామలింగేశ్వరస్వామిని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ సోమవారం రాత్రి విచ్చేసి దర్శించుకున్నారు. మేడ్చల్ జిల్లా కీసర మండలం కీసరగుట్ట శ్రీభవాని రామ లింగేశ్వరస్వామిని దీపావళి పండుగను పురస్కరించుకుని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ దంపతులు శ్రీస్వామి వారిని దర్శించుకున్నారు. గవర్నర్ కీసరగుట్టకు విచ్చేయటంతో ఆలయ ట్రస్ట్ వారు, సభ్యులు, పూజారులు గవర్నర్ తమిళిసై దంపతులకు స్వాగతం పలికి శ్రీస్వామి వారి పూజాకార్యక్రమంలో పాల్గొన్నారు. గవర్నర్ దంపతులు ఆలయంలో పూజలు చేశారు. కీసరగుట్టకు గవర్నర్ విచ్చేయటంతో అధికార యం త్రాంగం ఏర్పాట్లు చేసింది. గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ దంపతులను కీసరగుట్ట ఆలయం వారు సత్కరించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో కీసరగుట్ట ఆలయ చైర్మన్ తటాకం ఉమా పతిశర్మ, ఇఒ సుధాకర్‌రెడ్డి, ట్రస్ట్ బోర్డు సభ్యులు బొడుసు రమేశ్, ఉపసర్పంచు లక్ష్మణ్‌శర్మ, తదితరులు పాల్గొన్నారు.

# సౌత్ ఆఫ్రికా, జింబాబ్వే మ్యాచ్‌పై బెట్టింగ్

## టాస్క్‌ఫోర్స్‌కు చిక్కిన పందెంరాయుళ్లు

**హైదరాబాద్, అక్టోబరు 25, ప్రభాతవార్త:** ఆస్ట్రేలియా వేదికగా టి.20 వరల్డ్ కప్ మొదలవడంతో పందెం రాయుళ్లు మరోసారి బరిలో దిగారు. ప్రపంచంలోని ఏ మూలన మ్యాచ్‌లు జరిగినా వాటిని బెట్టింగ్ చేస్తున్న బెట్టింగ్‌రాయుళ్లు తాజాగా టి.20 వరల్డ్ కప్‌లో భాగంగా సోమవారం నాడు సౌత్ ఆఫ్రికా జింబాబ్వే జట్ల మధ్య వర్షం కారణంగా రద్దయిన మ్యాచ్‌ను కూడా వదల్లేదు. ఈ బెట్టింగ్ హైదరాబాద్‌లోని మారెడ్‌పల్లి కేంద్రంగా జరగగా దీనిపై పక్కా సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు నలుగురు పందెం రాయుళ్లను అరెస్టు చేశారు. ఈ సందర్భంగా వీరి వద్ద నుంచి లక్షా నాలుగున్నర వేల రూపాయల నగదుతో పాటు రెండు సెల్‌ఫోన్లను జప్తు చే శారు. దీనికి సంబంధించిన వివరాలను టాస్క్‌ఫోర్స్ డిసిపి రాధాకిషన్ రావు మంగళవారం మీడియాకు వెల్లడించారు. వెస్ట్ మారెడ్‌పల్లిలోని రైల్వే కాలనీకి చెందిన అజిత్ దేశ్‌పాండే (42) గతంలో ఓ సంస్థలో పనిచేసి కొంతకాలంగా ఖాళీగా వుంటున్నాడు. ప్రస్తుతం టి.20 వరల్డ్ కప్ జరుగుతున్న నేపథ్యంలో వున్నట్లుండి బుకీ అవతా రం ఎత్తాడు. తనకు పరిచయం వున్న వారిని బెట్టింగ్ వివరాలు తెలుసుకున్నాడు. అనంతరం తనకు స్నేహితులుగా వున్న జాంబాగ్‌కు చెందిన సికింద్రాబాద్‌లోని పిజి రోడ్‌కు చెందిన సందీప్ కులకర్ణి (43), బోయిన్‌పల్లికి చెందిన మయూర్ జోషి (49), రాంగోపాల్‌పేట్‌కు చెందిన సురేష్ (51)లను ఫంటర్లుగా నియమించుకున్నారు. వీరి సహాయంతో సోమవారం సౌత్ ఆఫ్రికా జింబాబ్వే జట్ల మధ్య జరిగిన టి.20 మ్యాచ్‌ను పందెంకాయసాగారు. మారెడ్‌పల్లిలోని తన ఇంటినే కేంద్రం మార్చుకుని అజిత్ దేశ్‌పాండే ఈ గోల్‌మాల్ జరుపుతుండగా సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్ రెడ్డి నేతృత్వంలోని పోలీసు బృందం పక్కా సమాచారంతో దాడిచేసి బుకీ దేశ్ పాండేతో పాటు అతని అనుచరులు ముగ్గురిని అరెస్టు చేసింది. ఈ సందర్భంగా వీరి వద్ద నుంచి లక్షా నాలుగున్నర వేల రూపాయల నగదుతో పాటు రెండు సెల ఫో న్లను జప్తు చేశారు. పట్టుబడ్డ నిందితులను తదుపరి విచారణ నిమిత్తం మారెడ్‌పల్లి పోలీసులకు అప్పగించారు.




టాస్క్‌ఫోర్స్‌కు చిక్కిన పందెం రాయుళ్లు

# టిఆర్ఎస్‌కు ఆర్‌టిసి ఉద్యోగులు, వైద్యులు బుద్ధి చెప్పాలి: హార్షవర్ధన్‌రెడ్డి

**హైదరాబాద్, అక్టోబరు 25, ప్రభాతవార్త:** మునుగోడు ఉప ఎన్నికలలలో 14 రకాల ఉద్యోగులు కాంగ్రెస్‌కి ఓటు వేసి టిఆర్ఎస్‌కు బుద్ధి చెప్పాలని కాంగ్రెస్ నేత హార్షవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మీడియాతో మాట్లాడారు. పిఆర్ఎస్ నిర్లక్ష్యం వల్ల ఉద్యోగులకు ఒక్కొక్కరికి రూ.5లక్షల రూపాయల నష్టం జరిగిందన్నారు. ఉద్యోగాలు భర్తీ లేదు, ప్రమోషన్లు లేవు అన్నారు. ఉద్యోగులకు హెల్త్‌కార్డులు లేవు, ఎనిమిది నెలలుగా పదోన్నతులు, బదిలీలు కూడా లేవన్నారు. మరి ఫ్రెండ్లీ గవర్నమెంట్ ఎలా అవుతుందని ప్రశ్నించారు.

# కర్ణాటకలో మరో మఠాధిపతి ఆత్మహత్య

**బెంగళూరు, అక్టోబరు 25:** కర్ణాటకలో మరో మఠాధిపతి ఆత్మహత్య కలకలం రేపుతోంది. రాష్ట్రంలోని రామనగర జిల్లా, మాగడి సమీపంలోని కెంపపురా గ్రామంలో శ్రీ కంచుగల్ బండే మఠాధిపతి బసవలింగ స్వామి (44) సోమవారం ఉదయం పూజా మందిరం కిటికీకి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. సోమవారం ఉదయం 6 గంటల ప్రాంతంలో శిష్యులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదుచేసుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నేలమంగళ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని మఠానికి అప్పగించారు. కాగా శ్రీ మహాలింగేశ్వర స్వామి ఆలయం ముందు ఉన్న పూజా గృహంలో బసవలింగ స్వాతి నివాసం ఉండేవారు. రోజూ తెల్లవారుజామున నిద్రలేచి పూజాది కార్యక్రమాలు నిర్వహిస్తూ ఉండేవారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం 6 గంటల 10 నిమిషాల ప్రాంతంలో మఠం ఉద్యోగి అంబరీష్ స్వామీజీ తన గది తలుపులు తీయడంలేదని, ఫోన్ కాల్స్ కూడా సమాధానం ఇవ్వడం లేదని బాండే మట్ పాఠశాల ఉపాధ్యాయుడు రమేష్‌కు శిష్యులు ఫోన్‌లో చెప్పారు. అక్కడికి చేరుకున్న రమేష్ గది వెనుకకు వెళ్లి చూడగా, కిటికీ గ్రిల్‌కి వేలాడుతూ కనిపించినట్లు పోలీసులకు తెలిపాడు.

### మూడు పేజీల సూసైడ్ నోట్

సంఘటన స్థలంలో పోలీసులు మూడు పేజీల సూసైడ్ నోట్‌ను కనుగొన్నారు. కొందరు తన వ్యక్తిత్వాన్ని తప్పుబట్టారని, అందుకే ఆత్మహత్య చేసుకుంటున్నట్లు తన సూసైడ్ నోట్‌లో పేర్కొన్నారు. సదరు వ్యక్తుల పేర్లను కూడా నోట్‌లో తెలిపారు. విచారణ కొనసాగుతుందన్నందున ఆయా వ్యక్తుల పేర్లను పోలీసులు వెల్లడించలేదని, దీనిపై దర్యాప్తు చేస్తున్నామని రామనగర ఎస్పీ సంతోష్ బాబు మీడియాకు తెలిపారు. కొందరు వ్యక్తులు స్వామీజీని గత కొంతకాలంగా బ్లాక్ మెయిల్ చేస్తున్నట్లు అనుమానిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఈ కోణంలో స్వామీజీ సన్నిహితులను, నిరంతరం ఫోన్‌లో టచ్‌లో ఉన్న వారిని విచారిస్తున్నట్లు పోలీసు అధికారి ఒకరు తెలిపారు.

# అధికార బలం, అవినీతి పరులకు మునుగోడు ప్రజలు బుద్ధి చెప్తారు

### మాజీ మంత్రి గీతారెడ్డి, ఎమ్మెల్యే సీతక్క

**హైదరాబాద్, అక్టోబరు 25, ప్రభాతవార్త:** ఉప ఎన్నికల్లో బిజెపి, టిఆర్ఎస్‌లకు వ్యతిరేకంగా తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పాల్వాయి స్రవంతి చాకచక్యంతో పోరాడుతున్నారని పార్టీ సీనియర్ మహిళా నేతలు, మాజీ మంత్రి గీతారెడ్డి, ఎమ్మెల్యే గీతారెడ్డిలు ప్రశంసించారు. ఉప ఎన్నికల్లో పాల్వాయి స్రవంతి అధికార బలం ఉన్న బిజెపికి టిఆర్ఎస్‌పై పూర్తి ధైర్యం నిబద్ధతతో పోరాడుతుందన్నారు. బిజెపి ఎన్నికల ప్రచారంలో పాల్వాయి స్రవంతి బిజెపి గుండాలు దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బిజెపి అభ్యర్థి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి భౌతికదాడులను ఆయుధంగా చేసుకుని భయభ్రాంతులకు గురిచేస్తున్నారని బిజెపికి మహిళలుఅంటే చిన్న చూపు ఉందని అన్నారు. బిజెపి గుండాలు కాంగ్రెస్ అభ్యర్థి స్రవంతి కాన్వాయ్‌పై రాళ్లు రువ్వడం లాంటి చర్యలతో బెదిరించే అవకాశం ఉందన్నారు.

# కేంద్ర కొలువుల పేరిట నిరుద్యోగులకు టోకరా

- టాస్క్‌ఫోర్స్‌కు చిక్కిన ఘరానా నేరగాళ్లు




కేంద్ర ప్రభుత్వ కొలువుల పేరిట నిరుద్యోగులకు టోకరా వేసిన కేటుగాళ్ల అరెస్టు వివరాలను మీడియాకు వెల్లడిస్తున్న అదనపు సిపి (సిట్ అండ్ క్రైం) ఎఆర్ శ్రీనివాస్

**హైదరాబాద్, అక్టోబరు 25, ప్రభాతవార్త:** ఆదాయపు పన్ను శాఖతో పాటు దక్షిణ మధ్య రైల్వే, ఇతర కేంద్ర ప్రభుత్వ విభాగాల్లో ఉద్యోగాల పేరిట అమాయకులను ని ండా ముంచిన ఓ అంతరాష్ట్ర ముఠాను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా వీరి వద్ద నుంచి 15 లక్షల రూపాయలకు పైగా నగదును కొన్ని వస్తు వులను జప్తు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను నగర అదనపు పోలీసు కమిషనర్ (క్రైం అండ్ సిట్) ఏ.ఆర్ శ్రీనివాస్ మంగళవారం మీడియాకు వెల్లడించారు, నగర శివార్లలోని ఉప్పర్‌పల్లికి చెందిన మహమ్మద్ సనావుల్లా అలియాస్ ఖాన్ సర్ (35) 2007లో డిగ్రీ చదివి పలు ప్రైవేటు పాఠశాలల్లో టీచర్‌గా పనిచేశాడు. సర్కా రు కొలువుకోసం యత్నించి విఫలమయ్యాడు. 2020లో కరోనా సమయంలో హైదరాబాద్ నుంచి ఇతర ప్రాంతాలకు అత్యవసరపనుల నిమిత్తం వెళ్లే వారికి పోలీసులు ఇచ్చే పాస్‌లకు నకిలీ వాటిని తయారు చేశాడు. పంజగుట్ట పోలీసుల పేరిట తయారు చేసిన ఈ నకిలీ పాస్‌లను సనావుల్లా కొందరి వద్ద నుంచి డబ్బులు తీసుకుని ఇ వ్వడం, వీటిని తీసుకున్న వారు పోలీసులకు దొరికిపోవడంతో సనావుల్లా అరెస్టయి జైలుకు వెళ్లాడు. దీని తరువాత కొందరు స్నేహితులతో క లిసి అమాయకులను మో సం చేసేందుకు కొత్త పథకం రచించాడు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించి వందల సంఖ్యలో అమాయకులను నిండా ముంచాలని నిర్ణయించాడు. ఇందుకోసం ఒక ముఠాను ఏర్పాటు చేసి ఎసి గార్డ్స్‌లోని యుఎన్ఐ భవనంలో నెలకు లక్షా పది వేల రూపాయల అద్దెతో ఒక ఫ్లోర్‌ను తీసుకుని అందులో ఇన్‌కం టాక్స్ సర్వీసెస్ పేరిట ఒక కార్యాలయాన్ని ఏర్పాటు చేశాడు. ఇందులో 40 కంప్యూటర్లను ఏర్పాటు చేసి, కొందరు సిబ్బందిని నియమించాడు. ఇతని ముఠాలో పశ్చిమ గో దావరి జిల్లాకు చెందిన ఆకాష్‌పూర్ వీరచైతన్య (23), దిల్‌సుక్‌నగర్‌కు చెందిన పాలెం అశోక్ కుమార్ రెడ్డి (34), బాలానగర్‌కు చెందిన గోడి వీర అర్జున్ రావు (34) హిమాయత్‌నగర్‌కు చెందిన కోల్కొండి రఘువీర్ (28), వైజాగ్‌కు చెందిన తిరుమల అనిల్ కుమార్ (36)లతో పాటు మరో పది మంది వున్నారు. వీరంతా యుఎన్ఐ భవనంలో వున్న కార్యాలయంలో అనేక హోదాల్లో పనిచేస్తూ అమాయకులకు ఎరవేసేవారు. తమకు తెలిసిన వారిని తెలివిగా మోసం చేస్తూ ఆదాయపు పన్ను శాఖలో టాక్స్ అసిస్టెంట్, టాక్స్ ఇన్‌స్పెక్టర్ పోస్టులతో పాటు దక్షిణ మధ్య రైల్వేలో గ్రూప్ సి పోస్టులు, నేషనల్ సాయిల్ కన్జర్‌వేషన్ అండ్ సైనిజేషన్ బోర్డులో గ్రూప్ సి పో స్టుల నియామకం పేరిట వందలాది మంది నుంచి మూడు నుంచి నాలుగు లక్షల రూపాయల వరకు వసూలు చేసేవారు. వీరిని నమ్మిన వారికి తమ కార్యాలయంలోనే శిక్షణా శిబిరాల పేరిట ఉత్తుత్తి శిక్షణను నాలుగు నెలల పాటు నిర్వహించే వారు ఈ సమయంలో 18 వేల రూపాయల స్టైఫండ్ ఇచ్చేవారు. అనంతరం వీరికి ఉత్తుత్తి కాల్ లెటర్ కూడా ఇచ్చేవారు. ఈ ముఠా విజయవాడలో కూడా ఒక కార్యాలయాన్ని ఏర్పాటు చేసి అక్కడ నేషనల్ సాయిల్ కన్జర్‌వేషన్ అండ్ సైనిజేషన్ బోర్డులో గ్రూ ప్ సి పోస్టుల నియామకం పేరిట అమాయకులను నిండా ముంచారు. కాగా ఈ ముఠా నుంచి ఫేక్ కాల్ లెటర్స్ అందుకున్న నిరుద్యోగులు ఆదాయపు పన్ను శాఖ, దక్షిణ మధ్య రైల్వే, నేషనల్ సాయిల్ కన్జర్‌వేషన్ అండ్ సైనిజేషన్ కార్యాలయాలకు వెళ్లి వాకబు చేయగా తాము మోసపోయామని నిర్ధారించుకుని పోలీసులను ఆశ్ర యించారు. దీంతో ఈ మోసగాళ్ల ముఠాపై విజయవాడతో పాటు హైదరా బాద్, రాచకొండ కమిషనరేట్ల పరిధుల్లో కేసులు నమోదయ్యాయి. ఈ కేసుల నేపథ్యంలో మొదట పాలెం అశోక్ కుమార్ రెడ్డి, తిరుమల అనిల్ కుమార్‌లను మొదట సైఫాబాద్ పోలీసులు అరెస్టు చేయగా మిగతా నలుగురిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు తాజాగా అరెస్టు చేశారు. నిందితుల నుంచి 15.30 లక్షల రూపాయల ను కొన్ని ఉత్తుత్తి ఫేక్ కాల్ లెటర్స్, నకిలీ రబ్బర్ స్టాంపులను జప్తు చేశారు. ఈ ముఠాకు చెందిన మ రో పది మంది పరారీలో వున్నారు. వారి కోసం గాలిస్తున్నారు. ఈ తరహా మోసాల పట్ల నిరుద్యోగులు జాగ్రత్తగా వుండాలని అదనపు సిపి ఏ.ఆర్ శ్రీనివాస్ కోరారు. ఈ సమావేశంలో సిసిఎస్ జాయింట్ సిపి గజారావు భూపాల్, టాస్క్‌ఫోర్స్ డిసిపి రాధాకిషన్ రావు తదితరులు పాల్గొన్నారు.

NLU DELHI

## నేషనల్ లా యూనివర్సిటీ ఢిల్లీ

(ఢిల్లీ యొక్క 2008 చట్టం నం.1 చే 2008లో స్థాపించబడిన లా విశ్వవిద్యాలయం)
సెక్టార్ 14, ద్వారక, న్యూఢిల్లీ-110078
వెబ్‌సైట్: https://nationallawuniversitydelhi.in, https://www.nludelhi.ac.in
హెల్ప్ డెస్క్ సంప్రదించు నం: 011-40787555, Email: ailetsupport@nludelhi.ac.in

### ప్రవేశానికి ప్రకటన 2023-24

| | |
|---|---|
| దరఖాస్తులు దాఖలుకు చివరి తేది (ఆన్‌లైన్) | : మంగళవారం, నవంబరు 15, 2022 |
| అడ్మిట్ కార్డు జారీ (ఆన్‌లైన్) | : మంగళవారం, నవంబరు 22, 2022 |
| అఖిల భారత లా ప్రవేశ పరీక్షకు తేది | : ఆదివారం, డిసెంబరు 11, 2022 (ఉ॥ 11.00 - మ॥ 12.30 గం.) |

**B.A. LL.B. (HONS.) (ఐదు-సంవత్సరాల ప్రోగ్రాం)**

**అర్హత:** XII స్టాండర్డ్‌లో 45% మార్కులు (SC/ST/PwD వారైతే 40%) లేదా తత్సమాన పరీక్ష. 2023లో XII స్టాండర్డ్ వార్షిక పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు అర్హులు.

**LL.M. (ఒక సంవత్సర ప్రోగ్రాం)**

**అర్హత:** LL.B.లో 50% మార్కులు (SC/ST/PwD వారైతే 45%) లేదా తత్సమాన లా డిగ్రీ. 2023లో LL.B. ఫైనల్ సంవత్సర వార్షిక పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు అర్హులు.

**Ph.D ప్రోగ్రాం**

**అర్హత:** 55% మార్కులతో LL.M. లేదా తత్సమాన లా డిగ్రీ. (SC/ST/PwD వారైతే 50%)

పరీక్ష నగరాలు: బెంగళూరు, బిలాస్‌పూర్, భోపాల్, ఛండీఘర్, చెన్నై, కొచ్చిన్, కటక్, డెహ్రాడూన్, ఢిల్లీ, గాంధీనగర్, ఘజియాబాద్, గ్రేటర్ నోయిడా, గురుగ్రామ్, గౌహతి, గోవా, హైదరాబాద్, ఇంఫాల్, జబల్పూర్, జైపూర్, జమ్ము, జోధ్‌పూర్, కాన్పూర్, కోల్‌కతా, కోట, లక్నో, మదురై, మంగళూర్, ముంబాయి, నాగపూర్, పాట్నా, పూణె, రాయ్‌పూర్, రాజ్‌కోట్, రాంచీ, తిరువనంతపురం, తిరుపతి, సిమ్లా, సిలిగురి, సిల్చార్, వారణాసి మరియు విశాఖపట్నం.

ఏ నగరంలో అయినా అభ్యర్థుల సంఖ్య 100కు తక్కువగా ఉంటే, ఆ నగరంలో పరీక్షా కేంద్రం నిర్వహించబడదు. అభ్యర్థులకు వారి దరఖాస్తు ఫారంలో సూచించిన 2వ/3వ నగర ప్రాధాన్యత ప్రకారం కేంద్రం కేటాయింపు ఉంటుంది.

ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తు రుసుము రూ.3,500/- (మూడు వేల ఐదు వందల రూపాయలు మాత్రమే) చెల్లింపుపై ఆన్‌లైన్ దరఖాస్తు చేయవలెను. SC/ST మరియు PwD లు అయినవారికి దరఖాస్తు రుసుము రూ.1500/- (ఒక వెయ్యి ఐదు వందల రూపాయలు మాత్రమే). దారిద్ర్యరేఖకు దిగువ ఉన్న (BPL) దరఖాస్తుదారులు SC/ST కేటగిరీ వారికి దరఖాస్తు రుసుము నుండి మినహాయింపు ఉంది.

కేటగిరీ ప్రకారం రిజర్వేషన్, సీట్ మేట్రిక్స్ మరియు ఆన్‌లైన్ దరఖాస్తు ఫారాలకు సంబంధించిన ఇతర వివరాలు, అడ్మిట్ కార్డులు, అర్హతా ప్రమాణాలు, పరీక్షా నమూనా విధానం వగైరాలకు దయచేసి https://nationallawuniversitydelhi.in. ను దర్శించండి.

ప్రొఫెసర్. (DR). హర్‌ప్రీత్ కౌర్
రిజిస్ట్రార్



## సూర్యగ్రహణ సమయంలో

# రోటిలో నిలబడిన రోకళ్లు!

**జగ్గయ్యపేట, అక్టోబరు 25, ప్రభాతవార్త :** సూర్యగ్రహణ సమ యంలో ప్రకృతిలో కంటికి కన్పించని తరంగథైర్యాలు, ఘాధత పెరిగే భూమ్యాకర్షణ శక్తి గురించి శాస్త్రవేత్తలు పరిశోధనలు కొనసా గిస్తున్నా తెలుగు వారు ప్రాచీన కాలంగా తమ అనుభవంతో గమ నించిన ఈమార్పును గుర్తు పడుతూ రోటిని, రోకళ్ళను పరిశోధనా వస్తువులుగా ఉపయో గిస్తూ అయస్కాంత శక్తి విశిష్టతను చాటు తున్నారు. 22 సంవత్సరాలకు ఒకసారి వస్తున్న పాక్షిక సూర్యగ్రహణం మంగళ వారం సాయంత్రం ప్రజానీకానికి అద్భుతఘట్టంగా ఆవిష్కృతం అయ్యింది. సాయంత్రం దాదాపు ఐదు గంటల నుండి గం.6.32ల వరకు సూర్యగ్రహణ పట్టువిడుపు కొనసాగింది. అయితే హైందవ సంస్కృతిలో గ్రహణ కాలంలో ఆచరించాల్సిన, ఆచరించకూడని విషయాల గురించి విస్తృత ప్రచారంలోవున్న విషయం తెలిసిందే. వేదాలు చదివిన వారు, సనాతన ధర్మంలోని పండితులు గ్రహణ సమయంలో జపతపాలకు శక్తి ఎక్కువగా చేకూరుతుందని ప్రాచీన శాస్త్రాల్లో సుస్పష్టంగా ఉందని అంటున్నారు. మరొకరికి ఇబ్బంది వాటిల్లకుండా వారి ఆచారవ్యవహారాలను వారు కొనసాగిస్తుండటం సార్వజనీకం. అయితే కొందరు వీటిని మూఢాచారాలుగా వ్యతిరేకిస్తూ వారి మనోభావాలను చులకనచేస్తూ వికృత కృత్యాలకు తలపడుతుండటం అక్కడక్కడ కన్పిస్తుంటాయి. అందుకు బదులుగా ఆచారాలను నమ్మేవారిని వారి విశ్వాసాల నుండే అందులోని సైన్స్ గురించి వివరించి అవగాహన కలిగించటం ద్వారా ఇవి మహత్యాలు కాదు, సహజ సిద్ధమైన ప్రకృతి నియమాలు అనే విషయాలను తెలియజెప్పే విధానాలను విద్యావంతులు అనుసరించటంలేదు. ఈక్రమంలో ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట ప్రాంతంలోని షేర్‌మహ్మద్‌పేట, బండిపాలెం, వేదాద్రి ప్రాంతాల్లో పలువురు సూర్యగ్రహణ సమయంలో ఈప్రయోగాలు చేశారు. ఎప్పుడూ సపోర్టు లేకుండా రోలులో నిటారుగా నిలువలేని రోకలి గ్రహణ సమయంలో నిలిచివుండటం వారికి ముచ్చట గొలిపింది. గ్రహణ కాలమంతా అలాగే నిలిచివున్న ఈరోకలి పట్టువిడుపు పూర్తికాగానే వాలిపోవటం కూడా విచిత్రంగానే ఆయాప్రాంతవాసులను ఆశ్చర్యపర్చాయి. భూ భ్రమణం, చంద్రుడు సూర్యబింబానికి అడ్డుగా వచ్చిన సందర్భంలో సూర్యరశ్మి ప్రసారానికి అంతరాయం ఏర్పడటం, ఆయా ప్రాంతాల్లో చంద్రుని నీడపడటం గురించి సహజంగా అందరికి తెలిసిందే. అయితే ఈసమయంలో ప్రకృతిలోవచ్చే స్వల్పమార్పుల గురించి ఇంకా మరింత పరిశోధనలు జరుగాల్సి వుందని విద్యావంతులు అంటున్నారు. సాంకేతిక విద్యను అభ్యసిస్తున్న నేటి ఆధునిక యువత కూడా ఈదిశగా స్వీయ పరిశోధనలకు దృష్టిసారించాలని వారు ఆకాంక్షిస్తున్నారు.

# మునుగోడులో అక్రమాలకు పాల్పడుతున్న పార్టీలు

## చర్యలు తీసుకోవాలంటూ కోదండరామ్ మౌనదీక్ష

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, అక్టోబరు 25:** మునుగోడులో పలు పార్టీల నాయకులు అక్రమాలకు పాల్పడుతూ ఎన్నికల నియమాలను ఉల్లంఘిస్తున్నారని ఈసీకి తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్ ఫిర్యాదు చేశారు. మునుగోడు ఉపఎన్నిక నిర్వహణ విషయంలో ఈసీ నిర్లక్ష్య వైఖరిని అవలంబిస్తోందని ఆయన ఆరోపించారు. తన బృందంతో కలిసి రాణిగంజ్ బుద్ధభవన్‌లోని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి కార్యాలయం ముందు బైఠాయించి మౌన దీక్ష చేపట్టారు. అనంతరం ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్‌ను కలిసి మునుగోడులో జరుగుతున్న అక్రమాలపై ఫిర్యాదు చేశారు. విచ్చలవిడిగా మద్యం డబ్బు పంపిణీ చేస్తున్నా, ఎన్నికల నిబంధనలను పూర్తిగా గాలికి వదిలేశారని కోదండరాం ఆరోపించారు. ఎన్నికల నియమాలను తుంగలో తొక్కుతున్నప్పటికీ కమిషన్ పట్టించుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రులు విచ్చలవిడిగా డబ్బు మద్యం పంపిణీ చేస్తున్నప్పటికీ పట్టించుకోకపోవడం దారుణమన్నారు.



కంటోన్మెంట్‌లో రహదారుల మూసివేతపై కాలనీ వాసులు, అధికారులతో సమావేశమైన కొత్వాల్ ఆనంద్

# కంటోన్మెంట్‌లో రహదారుల మూసివేతపై కాలనీవాసులు, అధికారులతో కొత్వాల్ సమావేశం

**హైదరాబాద్, అక్టోబరు 25, ప్రభాతవార్త:** సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లోని పలు రహదారులను మిలటరీ అధికారులు రాత్రివేళల్లో మూసివుంచడంపై అక్కడి కాలనీ వాసులతో పాటు పోలీసు అధికారులతో కొత్వాల్ ఆనంద్ మంగళవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా కంటోన్మెంట్‌లోని కాలనీ వాసులు రహ దారులను మిలటరీ అధికారులు మూసివేయడంతో తాము పడుతున్న ఇబ్బందులను కమిషనర్‌కు వివరించారు. మిలటరీ అధికారులు ఏకపక్షంగా వ్యవహరించడం వల్ల అనేక సమస్యలను చవిచూస్తున్నామని వారు తెలిపారు. దీనిపై కమిషనర్ ఆనంద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ రంగనాథ్‌తో పాటు ఉత్తర మండల డిసిపి చందనా దీప్తి, మధ్య మండల డిసిపి రాజేష్ చంద్ర, ట్రాఫిక్ డిసిపి కరుణాకర్ లతో సమాలోచనలు జరిపారు. 2018లో రక్షణ శాఖ తీసుకున్న నిర్ణయం మేరకు కంటోన్మెంట్‌లో రహదా రులను మిలటరీ అధికారులు రాత్రి వేళల్లో మూసివేస్తున్నారని కమిషనర్ వివరించారు. అక్కడ ట్రాఫిక్ ని ర్వహణ, భద్రత కల్పించడం వరకే పోలీసుల విధి అని ఆయన వెల్లడించారు. దీనిపై మిలటరీ అధికారుల తో ఒక ఉన్నతస్థాయి సమావేశం నిర్వహిస్తామని, ఇందులో సానుకూల నిర్ణయం కోసం యత్నిస్తామని ఆయన తెలిపారు.

# కాంగ్రెస్‌లో ప్రజాస్వామ్య బద్ధంగా జరిగిన ఎన్నిక : మాజీ మంత్రి పొన్నాల

**హైదరాబాద్, అక్టోబరు 25, ప్రభాతవార్త:** జాతీయ పార్టీ అయిన కాంగ్రెస్ పార్టీలో ప్రజాస్వామ్య బద్దంగా ఎన్నిక జరిపిందని మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య అన్నారు. బుధవారం ఏఐసిసి అధ్యక్షుడిగా మల్లిఖార్జున ఖర్గే ప్రమాణ స్వీకారం చేస్తున్నారని, ఆ కార్యక్రమానికి హాజరు కావాలని ఆహ్వానం అందిందని, తాను ప్రమాణ స్వీకారంలో పాల్గొంటున్నారనని అన్నారు. ఇది నేటి రాజకీయాల్లో ఒక అపూర్వమైన సంఘటనగా భావించాలన్నారు. జాతీయ పార్టీ అయిన కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నిక జరిపిందిదన్నారు. ఇది దేశంలో వేరే పార్టీ అయినా ప్రాంతీయ పార్టీలు అయినా ఎక్కడైనా జరిగిందా అని ప్రశ్నించారు. కానీ మా కాంగ్రెస్ పార్టీని సులువుగా విమర్శించారు.

# దీపావళి వేడుకల్లో అపశ్రుతి, ఐదుగురి పరిస్థితి విషమం

● సరోజినిదేవి, ఉస్మానియా, గాంధీకి క్యూ కట్టిన బాధితులు



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, అక్టోబరు 25:** దీపావళి వేడుకల్లో రాష్ట్రంలో పలు చోట్ల అపశృతులు చోటు చేసుకున్నాయి. ఒక్క హైదరాబాద్‌లోనే పటాకులు కాలుస్తూ 24 మంది చిన్నారులు గాయపడ్డారు. వివిధ జిల్లాల నుంచి ఉస్మానియా,సరోజినిదేవీ,గాంధీ తదితర ఆసుపత్రుల్లో పెద్ద సంఖ్యలో బాధితులు చేరారు. ఒక్క సరోజిని దేవీ కంటి ఆసుపత్రికే దాదాపు 50 మంది దాకా టపాసులతో గాయపడిన పేషెంట్లు వచ్చారంటే పరిస్థితి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. టపాసులు కాలుస్తున్న సమయంలో ప్రమాద వశాత్తు కాలిన గాయాలతో ఆసుపత్రుల్లో చేరిన వారిలో చిన్నారులే ఎక్కువగా ఉన్నారని వైద్యులు చెబుతున్నారు. గాయపడిన వారిలో చాలా మందిని అడ్మిట్ చేసుకుని చికిత్స అందించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. సరోజిని దేవీ కంటి ఆసుపత్రిలో నలుగురికి ఆపరేషన్ చేయాల్సి వచ్చిందని ఆసుపత్రి సూపరిండెంట్ తెలిపారు. చికిత్స పొందుతున్న వారిలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. వీరిలో ఎక్కువ మంది చిన్నారులే ఉండటం ఆందోళన కలిగిస్తోంది. గాయపడిన వారిలో ముగ్గురిని ఇతర ఆసుపత్రులకు సిఫారసు చేసినట్లు డాక్టర్లు పేర్కొన్నారు. దీపావళి వేడుకల్లో గాయపడిన వారికి చికిత్స అందించేందుకు సరోజిని దేవీ కంటి ఆసుపత్రి ప్రత్యేక వైద్య బృందాలను ఏర్పాటు చేసింది. ఉస్మానియా ఆసుపత్రిలోనూ దీపావళి బాణసంచా కాలుస్తూ గాయపడిన వారు పదుల సంఖ్యలో చేరారు. బాణా సంచా కాల్చే సమయంలో జాగ్రత్తలను విస్మరించడం వల్లే గాయాలపై పెద్ద సంఖ్యలో పేషెంట్లు ఆసుపత్రిలో చేరుతున్నారని వైద్యులు చెబుతున్నారు. బాధితుల్లో చిన్న పిల్లలే అధికంగా ఉన్నట్లు స్పష్టం చేశారు. బాధిత చిన్నారుల తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

# నమో అంటే.. నమ్మించి మోసం చేయడమే

కేంద్రంపై మళ్లీ విరుచుకుపడిన మంత్రి కెటిఆర్

కేంద్ర ఉద్యోగాల భర్తీని వెంటనే చేపట్టాలని ప్రధాని మోడీకి లేఖ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, అక్టోబరు 25:** కేంద్ర ప్రభుత్వంపై టిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్,మంత్రి కల్వకుంట్ల తారక రామారావు మరోసారి విరుచుకుపడ్డారు.నమో అంటే నమ్మించి మోసం చేసేవాడని రుజువైందని ఘాటుగా వ్యాఖ్యానించారు. 'రోజ్‌గార్ మేళా-2022' పేరుతో ప్రధానమంత్రి నరేంద్రమోడీ తీసుకొచ్చిన ఉద్యోగాల భర్తీ కార్యక్రమంపై మండిపడ్డారు. తాజాగా 10లక్షల ఉద్యోగాల రిక్రూట్మెంట్ అంటూ , నిరుద్యోగ యువతీ యువకులను మరోసారిఇ మభ్యపెట్టేందుకు మరో కొత్త నాటకానికి తెరలేపారని ఆరోపించారు.ఈ మేరకు ప్రధాని నరేంద్రమోడీకి మంగళవారం ఘాటైన బహిరంగ లేఖను ఆయన రాశారు. నిరుద్యోగ యువత జీవితాలతో పరిహాసమాడటం మాని చిత్తశుద్ధితో, దేశ వ్యాప్తంగా ఖాళీగా ఉన్న కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల భర్తీని వెంటనే చేపట్టాలని ప్రధానిని డిమాండ్ చేశారు. హిమాచల్‌ప్రదేశ్, గుజరాత్ ఎన్నికల ముందర మోడీ మరో కొత్త డ్రామా అని కెటిఆర్ విమర్శించారు. 'గౌరవనీయులైన ప్రధానమంత్రి నరేంద్రమోడీగారు, మీరు చేపట్టిన రోజ్‌గార్ మేళాతో దేశ యువత సంతోషం ఎక్కువ రోజులు ఉండేది కాదని అర్థమైంది. ఎందుకంటే ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలను నింపుతామని ప్రకటించిన మీ మాటలు నమ్మి నాటి నుంచి నేటి వరకు మీ ఎనిమిదేండ్ల పాలనలో 16 కోట్ల ఉద్యోగాల కోసం నిరుద్యోగ యువత ఆశతో ఎదురు చూస్తున్న పరిస్థితి నేడు దేశ వ్యాప్తంగా నెలకొంది. ఇట్లా ఏటేటా పెరుగుతున్న నిరుద్యోగుల ఆశలతో మరోసారి రోజ్‌గార్ మేళా పేరుతో మీరు ఆటలాడటం ఏమాత్రం సరైన చర్య కాదు' అని తప్పుపట్టారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాల భర్తీ అని చెప్పిన మీరు, ఇప్పుడు ఆ సంఖ్యను 10లక్షలకు కుదించారు. అంతటితో ఆగకుండా కేవలం 75వేల మందికి మాత్రమే నియామక పత్రాల అందజేసి, ఆర్థిక వ్యవస్థ అనేక కష్టాల్లో ఉందంటూ మీరు చేసిన వ్యాఖ్యలు, ఈరోజ్‌గార్ హామీ మీద కూడా అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. అయితే కేవలం మీ పరిపాలన వైఫల్యం అడ్డగోలు ఆర్థిక విధానాలు వలనే దేశ ఆర్థిక వ్యవస్థ నేల చూపులు చూస్తున్నదనే విషయం మీకు గుర్తు చేస్తున్నానని తెలిపారు. కోట్ల ఉద్యోగాలు హామీ ఇచ్చి, కేవలం వేల ఉద్యోగాలతో మీరు చేస్తున్న మీడియా ప్రచారా పటోపం, పదే పదే నిరుద్యోగ యువతతో పరిహాసం ఆడుతున్నట్లు ఉన్నది. ఇది కేవలం మీరు, మీ బిజెపి పార్టీ ప్రభుత్వం నిత్యం ప్రదర్శించే అర్భాటపు ప్రచారమే తప్పిస్తే మరోటి కాదని మరోసారి ప్రజలకు అర్థమైందన్నారు. ఇటువంటి అర్భాటపు ప్రచార కార్యక్రమాన్ని నిరుద్యోగ యువత మీద రుద్దే ప్రయత్నం చేయడం దారుణం అనే విషయాన్ని నేను మీకు స్పష్టం చేయదలిచానని పేర్కొన్నారు. ఇదే నిరుద్యోగుల భర్తీ విషయం మీద,దేశ వ్యాప్తంగా ఉన్న ఖాళీలను నింపాలని, యువతకు ఉపాధి అవకాశాలను కల్పించాలని 9 జూన్ 2022 నాడు నేను మీకో బహిరంగం లేఖ రాసిన, దానికి మీ నుంచి ఎటువంటి సమాధానం రాలేదు. రోజ్‌గార్ మేళా పేరుతో కబేళాలో బలి పశువుల మాదిరి నిరుద్యోగ యువతను మరోసారి మోసం చేస్తున్నారు. మీరు ఇస్తామన్న రెండు కోట్ల ఉద్యోగాలా హామీ మేరకు ఇప్పటిదాకా 16 కోట్ల ఉద్యోగాలు కల్పించాల్సి ఉండే కానీ, మీరు చేస్తున్న ఈ రోజ్‌గార్ మోసంతో భాత్ కరోడోమే... కామ్ పకోడోమే అన్న తీరుగా మారిందన్నారు. మీరు ఇలా పదే పదే ఉద్యోగాల విషయంలో యువతను మోసం చేస్తూ మభ్యపెడుతున్న తీరుతో నమో అంటే నమ్మించి మోసం చేసేవాడు అని రుజువు అయిందన్నారు. మూడున్నర కోట్ల తెలంగాణ జనాభాకు రాష్ట్రం వచ్చిన ఎనిమిదేండ్లలో సుమారు లక్షా 50వేల ఉద్యోగాలను భర్తీ చేసినం, మరో 91వేలకు పైగా ఉద్యోగాలు భర్తీ చేసే ప్రక్రియ ప్రారంభించినం, అంటే ఒక్క తెలంగాణ రాష్ట్రంలోనే దాదాపు 2,50,000 ఉద్యోగాలకు పైగా భర్తీ చేస్తున్నప్పుడు, 130 కోట్ల దేశ జనాభాలో మీరు నింపిన ఉద్యోగాలెన్ని? దాని శాతమెంత? తెలంగాణ ప్రభుత్వం తన వంతుగా నిర్వహిస్తున్న బాధ్యతలో కేంద్రం నిర్వహిస్తున్న బాధ్యత చాలా చిన్నదని గణాంకాలే చెబుతున్నాయి, లెక్క లేస్తే మీ అసలు రంగు బయటపడుదుతుంది. దేశంలో ఏటా 2 లక్షలకు పైగా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు రిటైరవుతున్నారు. ఈ పరిస్థితుల్లో కనీసం ఏటా 50వేల ఉద్యోగాలను కూడా సరిగ్గా భర్తీ చేయని మీరు, రోజ్‌గార్ మేళా పేరుతో కేవలం 75వేల మందికి నియామక పత్రాల అందజేయడాన్ని దేశ నిరుద్యోగులు గమనిస్తున్నారని పేర్కొన్నారు. కేంద్రం చేపట్టిన ప్రభుత్వ రంగ సంస్థల అమ్మకాల పందేరం వలన సుమారు రెండున్నర లక్షల మంది రెగ్యులర్ ఉద్యోగాలను కోల్పాయారని, ప్రభుత్వ రంగ సంస్థలో సుమారు 50శాతం ఉన్న రిజర్వ్‌డ్ కేటగిరీలకు చెందిన వారికి భవిష్యత్తులోనూ శాశ్వతంగా ఉద్యోగ అవకాశాలు దొరకుండా పోతున్నాయన్నారు. 2014 నుంచి 2022 ఎనిమిదేండ్లలో జూన్ 2022 నాటికి కేంద్రం భర్తీ చేసిన ఉద్యోగాల సంఖ్య కేవలం 7లక్షలు మాత్రమే. ఇంకా భర్తీ చేయాల్సిన ఉద్యోగాలు సుమారు 16లక్షలు ఉన్నాయని మీ ప్రభుత్వమే చెప్పిందన్నారు. అయితే మీరు రోజ్‌గార్ మేళా ద్వారా కేవలం 75వేల మందికి నియామక పత్రాలు అందించడం ద్వారా నిరుద్యోగులను మీరేం చేయదలచుకున్నారు అని ప్రశ్నించారు.

# కాంగ్రెస్ కార్యకర్తల్లారా! మునుగోడుకు కదలిరండి

## పిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి

**సంస్థాన్‌నారాయణపురం, అక్టోబరు 25, ప్రభాతవార్త:** మునుగోడులో జరిగే కదన రంగానికి కాంగ్రెస్ కార్యకర్తలు తరలి రావాలని టి.పిసిసి అధ్యక్షులు, ఎంపీ అనుముల రేవంత్‌రెడ్డి కోరారు. మంగళవారం ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ అభ్యర్థిని పాల్వాయి శ్రవంతిరెడ్డి గెలుపును కాంక్షిస్తూ కడీలబావితండా, మల్లారెడ్డిగూడెం, గుజ్జ గ్రామాల్లో పర్యటించి ఆయా గ్రామాల్లో జరిగిన ఎన్నికల సభల్లో మాట్లాడుతూ మునుగోడు ఉప ఎన్నికల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయన్నారు. ఓ పక్క కేసిఆర్ రాష్ట్ర పోలీసులతో, మరో పక్క కేంద్ర ప్రభుత్వం కేంద్ర బాలగాలను దింపి ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే బలమని, మల్లారెడ్డిగూడెం వేదికగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కాంగ్రెస్ పార్టీ సానుభూతి పరులు, కార్యకర్తలు, అభిమానులు మునుగోడుకు తరలి వచ్చి ఆడ బిడ్డను గెలిపించి ఆత్మగౌరవాన్ని కాపాడుకోవాలన్నారు. మూడో తారీకు నాడు జరుగబోయే ఎన్నికల్లో ఇద్దరి నరకాసుద వదను కాంగ్రెస్ కార్యకర్తలు వరించాలన్నారు. కాంగ్రెస్ హాయాంలో రాచకొండ ప్రాంతంలో వేదిలా ఎకరాలకు పట్టాలు ఇస్తే రాష్ట్ర ముఖ్యమంత్రి కేసిఆర్‌కు కన్ను పడటంతో భూములను లాగుకునేందుకు ఫారెస్టు అధికారులతో చిత్ర హింసలకు గురి చేస్తున్నారన్నారు. పోడు భూములను సమస్యలను గుర్తించి పట్టాలను గుంజుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఎనమిదున్నరేళ్ల టిఆర్‌ఎస్ పాలనతో అయ్యా కొడుకులు, బిడ్డ, అల్లుడు, తోడల్లుడికి రాజ్యాధికారం ఇస్తే ఈ ప్రాంతంలో ఒరగబెట్టిందేమి లేదన్నారు. ఓ కన్నేసి ఈ ప్రాంతాన్ని దత్తత తీసుకుంటానని ఇన్నేళ్ల కాలంలో ఒరగబెట్టిందేముందన్నారు. రూ.వేల కోట్ల కోసం ఓట్లు అమ్ముకున్న రాజగోపాల్‌రెడ్డి ఏ ముఖం పెట్టుకుని ఈ ప్రాంతంలో తిరుగుతాడన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు రాజగోపాల్‌రెడ్డిని ప్రశ్నిస్తే రౌడీలతో కొట్టిస్తున్నాడని, కాంగ్రెస్ కార్యకర్తల్లారా అధైర్యపడవద్దన్నారు. లాఠీలకు, తూటాలకు అడ్డు ఉంటానని ధైన్యం చెప్పారు. ఉప ఎన్నికల్లో రాజగోపాల్‌రెడ్డి గుండెలపై గుద్దులు గుద్ది పాతాలానికి తొక్కాలని కార్యకర్తలకు సూచించారు. గండ్ర సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని పాల్వాయి స్రవంతి, మాజీ మంత్రి నాగం జనార్ధన్‌రెడ్డి, రుద్రమాదేవి, చల్లమల్ల కృష్ణారెడ్డి, పున్న కైలాష్, వంగూరి సత్తయ్య, మల్లేశం యాదవ్, గనం అంజయ్య, జగదీష్ తదితరులున్నారు.

## టిఎస్ఎస్‌పి పోలీసులపై యూట్యూబ్ ఛానల్‌లో వచ్చిన వార్తలు అవాస్తవం

**హైదరాబాద్, అక్టోబరు 25, ప్రభాతవార్త:** తెలంగాన స్పెషల్ పోలీసులపై యూ ట్యూబ్ ఛానల్‌లో వచ్చిన వార్తను ఆ విభాగం అదనపు డిజి అభిలాష్ బిస్త్ తీవ్రంగా ఖండించారు. కెసిఆర్ ఫాం హౌస్‌లో తమ విభాగం పోలీసులు పనులు చేస్తున్నారని, ఆ కథనంలో వుందని, ఇది పూర్తిగా నిరాధారమైనదని ఆమె పేర్కొన్నారు. తమ విభాగం సిబ్బంది నిత్యం తమ తమ విధుల్లో వుంటారని, ఈ క్రమంలో కెసిఆర్ ఫాం హౌస్‌లో వ్యవసాయ పనులు చేయడం అనేది ఎలా కుదురుతుం దని ఆమె ప్రశ్నించారు. తమ విభాగంలో ని అన్ని బెటాలియన్‌లో 4.2 లక్షల మొక్కలను పెంచుతున్నామని, వాటి సంరక్షను వర్మీ కంపోస్ట్ ఎరువులను తయారు చేస్తున్నామని, ఇందులో భాగంగా ఏడవ బెటాలియన్ సిబ్బంది పనులు నిర్వహిస్తుండగా యూ ట్యూబ్ ఛానల్ తప్పుడు కథనం ప్రసారం చేసిందని ఆమె వెల్లడించారు.

# స్కూల్‌లో లైంగిక ఘటన నిందితుడిని శిక్షించాలి

## మంత్రి సబితకు ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, ఐద్వా విజ్ఞప్తి



**హైదరాబాద్, అక్టోబరు 25, ప్రభాతవార్త:** బంజారాహిల్స్‌లోని డీఏవీ పబ్లిక్ స్కూల్ సంఘటనలో నేరస్తులను కఠినంగా శిక్షించాలని .. ప్రస్తుతం అందులో చదువుతున్న విద్యార్థులకు న్యాయం చేయాలని భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ), భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య(డీవైఎఫ్ఐ), అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) డిమాండ్ చేశాయి. ఘటనకు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ సంఘాల హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు అశోక్‌రెడ్డి, ఎండీ జావీద్, నాగలక్ష్మి విద్యా శాఖ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డికి మంగళవారం వినతిపత్రం సమర్పించారు. స్కూల్‌లో చిన్నారిపై జరిగిన అఘాయిత్యంపై వెంటనే స్పందించినందుకు సంఘాల నాయకులు మంత్రికి ధన్యవాదాలు తెలిపారు. స్కూల్ గుర్తింపును రద్దు చేసి స్కూల్‌ను మూసివేయడంతో పిల్లల తల్లిదండ్రులు చాలా ఆందోళనలో ఉన్నారిన.. స్కూల్‌ను ప్రభుత్వమే స్వాధీనం చేసుకొని స్కూల్‌ను యధావిధిగా నడపాలని వారు మంత్రిని కోరారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రవేటు పాఠశాల్లో చదివే బాలికలకు సరైన రక్షణ కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అన్ని స్కూల్స్‌లోనూ విస్తృత తనిఖీలు చేపట్టి ఇలాంటి ఘటనలు మరెక్కడా జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతీ స్కూల్‌లోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. స్కూల్‌కు సరిపడే సంఖ్యలో టీచర్లు, ఆయాలు ఉండే విధంగా చూడాలన్నారు. అంతర్గత ఫిర్యాదు కమిటీలను ఏర్పాటు చేయాలని కోరారు. పేరెంట్స్‌తో యాజమాన్యం తరచుగా సమావేశాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సిబ్బందిని నియమించే సమయంలోనే వారి బ్యాక్ గ్రౌండ్(పూర్వాపరాలను)ను తెలుసుకొని నియమించేలా చూడాలన్నారు. అధికారులతో చర్చించి తగు చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చినట్టు సంఘాల నాయకులు తెలిపారు.

## నాకు విస్తృత అధికారాలు ఉంటాయి,

# త్వరలో పరిశీలిస్తా

## బిల్లులపై ప్రభుత్వానికి గవర్నర్ తమిళిసై షాక్!

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, అక్టోబరు 25:** తెలంగాణలో టిఆర్ఎస్ ప్రభుత్వం, గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ మధ్య ఏర్పడిన మనస్పర్థలు ఇంకా కొనసాగుతున్నాయి. విమర్శల పర్వం మరింత పెరుగుతోంది. ఇప్పటికే గవర్నర్ తమిళిసై బహిరంగంగానే కెసిఆర్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు,ఆరోపణలు గుప్పించారు.గవర్నర్ వ్యాఖ్యలకు కౌంటర్ ఇస్తూ పలు సందర్భాలలో టిఆర్ఎస్ నేతలు సైతం తమిళిసై సైతం ఎదురు విమర్శలు కూడా చేశారు. కాగా, గవర్నర్ తమిళిసై మరోసారి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. దీపావళి పండుగ రోజు ఆమె మీడియాతో మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాల్లో పాసైన బిల్లలకు ఆమోదం తెలిపే అంశం పూర్తిగా నా పరిధిలోనిదని, గవర్నర్‌గా నాకు విస్తృత అధికారాలు ఉంటాయని పేర్కొన్నారు. నా పరిధిలోకి లోబడే నేను నడుచుకుంటానని, పెండింగ్‌లో ఉన్న బిల్లులను త్వరలోనే పరిశీలించ నిర్ణయం తీసుకుంటానని చెప్పారు. తాను ఎవరికి వ్యతిరేకం కాదని,గవర్నర్‌గా నా బాధ్యతలను అనుసరించే నిర్ణయాలు వెలువరిస్తానని స్పష్టం చేశారు. అంతకు ముందు కూడా గవర్నర్ తమిళిసై తెలంగాణ ప్రభుత్వం సిఎం కెసిఆర్‌పై కీలక వ్యాఖ్యలు చేశారు. గణతంత్ర దినోత్సవం రోజున తనని జెండా ఆవిష్కరించనివ్వలేదని,ప్రసంగం కూడా చేయనివ్వలేదని ఘాటు వ్యాఖ్యలు చేశారు. అయినప్పటికీ తన పని తాను చేసుకుంటూ పోతున్నానని అన్నారు. ఏనాడూ నేను అధికార దుర్వినియోగానికి పాల్పడలేదని పేర్కొన్నారు. రాజ్‌భవన్‌లోతనకయ్యే ఖర్చును మొత్తం తానే భరిస్తున్నట్లు వెల్లడించారు. ప్రతినెలా తనకయ్యే ఖర్చును తానే సొంతంగా చెల్లిస్తున్నానని, ప్రభుత్వ సొమ్మును ఉపయోగించుకోవడం లేదని పేర్కొన్నారు.

## ముషీరాబాద్‌లో మరోసారి మత ఘర్షణ

**హైదరాబాద్ (ధర్నాచౌక్), అక్టోబరు 25, ప్రభాతవార్త:** ముషీరాబాద్ నియోజకవర్గంలోని గాంధీనగర్ డివిజన్‌లో మరోసారి మత ఘర్షణ చెలరేగింది. చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని గోల్కొండ క్రాస్‌రోడ్సులో ఉన్న అర్చన అపార్ట్‌మెంట్‌లోని నాలుగవ అంతస్థులో నివసించే జి.మహాలక్ష్మి అనే యువతి దీపావళి సందర్భంగా ఇంటి ముందు ముగ్గువేసి, దీపాలు పెట్టుకుంది. మహాలక్ష్మికి ఎదురుగా ఉండే ఫ్లాట్‌లో ఉండే వేరే మతమహిళ దీపాలు బయట పెట్టటానికి వీలు లేదు, ఇంట్లోనే పెట్టుకో అంటూ కాలితో తన్నింది. దీపావళి దీపం పెట్టుకుంటే తప్పు ఏమిటి అంటే, ఆమహిళ ఆవేశంగా తిట్టటమే కాకుండా చెప్పుతో కొడతా అంటూ బెదిరించటం, ఆమె కొడుకు సైతం మహాలక్ష్మి ని తిట్టటం సోషల్ మీడియాలో వైరల్ అవటంతో వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ నాయకులు సంఘటనా స్థలికి వచ్చారు. విషయం తెలుసుకున్న చిక్కడపల్లి పోలీసులు అపార్ట్‌మెంట్ వద్దకు రావటంతో హిందూ మనోభావాలను దెబ్బతీయటమే కాకుండా ఒక యువతిని తిట్టిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ వీహెచ్‌పీ నేతలు డిమాండ్ చేశారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించామని పోలీసులు తెలిపారు.



ఎన్నికల సభలో ప్రసంగిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

# కెసిఆర్ సంక్షేమ పథకాలే శ్రీరామ రక్ష

## మంత్రి జగదీశ్‌రెడ్డి

**చౌటుప్పల్, అక్టోబరు 25, ప్రభాతవార్త:** కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో సిఎం కేసిఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే మునుగోడు ఉప ఎన్నికల్లో టిఆర్ఎస్ గెలుపుకు నాంది పలుకుతాయని రాష్ట్ర విద్యుత్‌శాఖా మంత్రి గుంతకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. ఉప ఎన్నికల్లో భాగంగా మంగళవారం తూప్రాన్‌పేట నుంచి అల్లాపురం వరకు నిర్వహించిన ప్రచారంలో టిఆర్ఎస్ అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డితో పాటు మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు, జీవన్‌రెడ్డి, సిసిఎం నాయకులు చేరుపలి సీతారాములు తదితరులతో కలిసి ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకు ఓటేసి భారీ మోజార్టీతో గెలిపించాలని కోరారు.

# సాగ్లొస్తున్నారు..

≫ ఢిల్లీ పెద్దలు మునుగోడులో ప్రచారం చేస్తున్నారు. ఈ నెలాఖరులో కేంద్ర పెద్దల్లో ఒకరు బిజెపి అభ్యర్థికోసం, ముఖ్యమంత్రి కెసిఆర్ టిఆర్ఎస్ అభ్యర్థి కోసం భారీ బహిరంగ సభలు నిర్వహించబోతున్నారు. అయితే స్థానికులు ఈ హడావుడి చూసి విస్తుపోతున్నారు. వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు రాబోతున్నందున అన్ని పార్టీలు మునుగోడు ఉప ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని తీవ్రంగా పోరాడుతున్నాయి. రాష్ట్ర పరిపాలన అంతా మునుగోడు నుంచే సాగుతున్నట్లుగా కనిపిస్తోంది. 15 మంది రాష్ట్ర మంత్రులు, 71 మంది టిఆర్ఎస్ ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలు, ఎంపీలు,పలువురు కార్పొరేషన్ చైర్మన్లు ప్రచారంలో తలమునకలయ్యారు. కెటిఆర్, హరీష్‌లు రోడ్‌షోలు చేస్తున్నారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, ఆ పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు అక్కడే ఉన్నారు. కాంగ్రెస్ కూడా బాగానే ఎన్నికల ప్రచారం నిర్వహిస్తోంది. నిత్యం హైదరాబాద్‌లోనే కనిపించే కాంగ్రెస్ సీనియర్లంతా ఇప్పుడు మునుగోడులోనే ప్రచారం చేస్తున్నారు. పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర ఇన్‌చార్జ్ మాణిక్కం ఠాగూర్ సహా మునుగోడు ప్రచారంలో పూర్తిగా మునిగిపోయారు. కాగా, కీలక నేతల పర్యటన, ప్రచారంతో పోలీస్ యంత్రాంగానికి కంటి మీద కునుకు కరువైంది. స్థానిక పోలీసులకు తోడుగా ఇతర జిల్లాల నుంచి కూడా వేలాదిగా పోలీసులను అక్కడ మోహరించారు. వాహనాల తనిఖీలు కూడా ముమ్మరంగా సాగుతున్నాయి. పోలీస్ చెక్‌పోస్టులు,బారికేడ్లు పెట్టి వాహనాలు తనిఖీలు నిర్వహిస్తున్నారు. తాము చూడని పెద్ద పెద్ద కార్లు రావడం,ఇరుకు రోడ్లలో ట్రాపిక్ జామ్‌లతో మునుగోడు ప్రజలు సతమతమవుతున్నారు. మొత్తంగా మునుగోడు ప్రచార హోరు తీవ్ర రూపంలోనే ఉంది.

మునుగోడు ఉప ఎన్నికలో దివ్యాంగులు,80 ఏళ్లు పైబడిన 318 మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోస్టల్ బ్యాలెట్ కోసం 739 మంది దరఖాస్తు చేసుకోగా, వారు ఓటు హక్కు వినియోగించుకునేందుకు వీలుగా ఏడు బృందాలను ఏర్పాటు చేశారు. మొదటి దశలో ఆదివారం నుంచి మంగళవారం వరకు ఆయా బృందాలు వారి ఇళ్ల వద్దకు వెళ్లి ఓట్లు నమోదు చేశాయి. సోమవారం వరకు 318 మంది ఓటు హక్కు వినియోగించుకున్నట్లు సీఈవో వికాస్ రాజ్ తెలిపారు. రెండో దశలో 27,28 తేదీల్లో బృందాలు ఇళ్ల వద్దకు వెళ్తాయని చెప్పారు. అభ్యర్థులు,వారి ఏజెంట్ల సమక్షంలో ఈవీఎం కమిషనింగ్ పూర్తయిందని, 5శాతం మాక్ పోలింగ్ కూడా విజయవంతంగా జరిగిందని సీఈవో పేర్కొన్నారు. నియోజకవర్గంలో చెక్‌పోస్టుల వద్ద ఏర్పాటు చేసిన వీడియో కెమెరాలను పారదర్శకత కోసం నల్లగొండ కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌కు అనుసంధానించినట్లు వివరించారు. పార్టీల అభ్యర్థులు,ఏజెంట్ల తరఫు వారు అక్కడ లైవ్ వీక్షించవచ్చని సీఈవో తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘణకు సంబంధించి ఇప్పటి వరకు 19 ఎఫ్ఐఆర్‌లు నమోదు కాగా, రూ.2.70 కోట్ల నగదు స్వాదీనం చేసుకున్నట్లు చెప్పారు.

అందం విషయంలో తొలి ప్రాధాన్యం ముఖానిదే! ఈ క్రమంలోనే ముఖం, కళ్లు, పెదాలు.. కళగా ఉంటేనే ముఖ సౌందర్యం ఇనుమడిస్తుంది. అందుకోసం ఈ చిట్కాలు పాటిస్తే సరి.

# వేడుకల్లో.. మరింత అందంగా..



**ముచ్చటైన మోము కోసం..**

- చివరి నిమిషంలో అందంగా కనపడాలన్న ఆలోచనతో కనుబొమ్మలు సరిచేయడం, ముఖంపై గల అవాంఛిత రోమాలను తొలగించడం చేయకూడదు. కనుబొమ్మలు మరీ ఎక్కువగా పెరిగాయనుకుంటే చుట్టూ ఉన్న కొన్ని వెంట్రుకలను మాత్రం తొలగించి మిగిలిన వాటిని కన్సీలర్ సహాయంతో చర్మం రంగులో కలిసేలా చేయాలి. తద్వారా సహసిద్ధంగా కనిపించే అవకాశం ఉంటుంది.
- ఒకవేళ కళ్ల కింద నలుపు ఎక్కువగా ఉన్నట్లు అనిపిస్తే చల్లని పాలలో దూదిని ముంచి కళ్లపై పెట్టుకుని కాసేపు కునుకు తీయండి. అదే సమయంలో అందుబాటులో ఉన్న ఏదైనా ఒక పండు గుజ్జునో లేక టొమాటో రసాన్నో ముఖానికి, మెడకి ప్యాక్‌లా వేసుకుని ఇరవై నిమిషాల తర్వాత చల్లని నీటితో కడిగేస్తే ఒకసారి రెండు పనులూ పూర్తవుతాయి.



- సరైన నిద్ర ముఖాన్ని మరింత కాంతివంతం చేస్తుందని మర్చిపోకండి. అందుకే ఎంత హడావిడిగా ఉన్నా నిద్ర సమయాన్ని మాత్రం తగ్గించకండి.
- కాస్త ఉప్పు, చిటికెడు వంటసోడా కలిపి దంతాలను శుభ్రం చేసుకుంటే దంతాలు మిలమిలా మెరుస్తాయి.
- పెదాలను చక్కరతో స్క్రబ్ చేసి, కడిగిన తర్వాత వెంటనే మాయిశ్చరైజర్ రాసుకోవాలి.



**కురులు కూడా ముఖ్యమే!**

హెయిర్ ప్యాక్ వేసుకునే సమయం లేకపోతే నాలుగు విటమిన్-ఇ ట్యాబ్లెట్లను కత్తిరించి, అందులోని లిక్విడ్‌ని మీ వెంట్రుకలకు సరిపడేంత కొబ్బరి నూనెలో కలిపి కుదుళ్ల నుంచి వెంట్రుకల చివర్ల వరకు పట్టించాలి. ఆపై ఒక ఐదు నిమిషాలు మర్దన చేసి ఇరవై నిమిషాల తర్వాత షాంపూ చేసుకోవాలి. (కళ్లకు, ముఖానికి ప్యాక్ చేసుకున్న సమయంలోనే ఈ నూనెను కూడా అప్లై చేసుకోవడం వల్ల సమయం కలిసొస్తుంది.)

**మృదువైన చేతులు, సున్నితమైన పాదాల కోసం..**

- మెనిక్యూర్, పెడిక్యూర్ చేయించుకునే సమయం లేనప్పుడు చేతికి, కాలికి ఉన్న గోళ్లని షేప్ చేసుకుని, హెయిర్ మాస్క్ కోసం తయారు చేసుకున్న కొబ్బరి నూనె మిశ్రమాన్ని పట్టించాలి.



- మడమలకి ఉన్న పగుళ్లని, మృత చర్మాన్ని స్క్రబ్బర్‌తో తొలగించాలి.
- ఇందాక తయారు చేసుకున్న ఫేస్‌ప్యాక్‌ని గోళ్ల భాగం వదిలి.. కాళ్లు, చేతులకు రాసుకుని ఆరిన తర్వాత కడిగేయాలి. కడిగిన వెంటనే మాయిశ్చరైజర్ రాసుకోవాలి. ❑

# గ్రామీణ బాలబాలికల్ని ప్రయోజకులుగా..

**'అమ్మాయికి చదువెందుకు.. పెళ్లిచేసి పంపేయక' అని ఉచిత సలహాలిచ్చే వాళ్లని చూస్తుంటే కోపం వచ్చేదామెకు. దాంతో మరింత కసితో చదివేది. చదువుతోనే తల రాత మారుతుందని తనకు తెలుసు. బాగా చదివినా ఆర్థిక కారణాలవల్ల కోరుకున్న కోర్సుల్లో చేరలేకపోయింది. అయినా నిరుత్సాహపడలేదు. ఉపాధ్యాయ వృత్తిని ఎంచుకుని.. మూడున్నర దశాబ్దాలుగా గ్రామీణ బాలబాలికల్ని ప్రయోజకులుగా తీర్చుదిద్దుతున్నారు ముత్తా కృష్ణవేణి.**



ఆది 2015 సెప్టెంబరు 15.. ప్రధాని చేతుల మీదుగా జాతీయ ఉత్తమ ఉపాధ్యాయురాలు అవార్డు అందుకోవడానికి ఢిల్లీ వెళ్లారు. కృష్ణవేణి. అక్కడి వాతావరణం కొత్తగా ఉంది. అంతలో 'మేడమ్ నన్ను గుర్తుపట్టారా' అంటూ ఓ ఆత్మీ పలకరింపు. తను ఆమె విద్యార్థినేనని పరిచయం చేసుకున్నారా యువ ఐఎఎస్. జాబితాలో తమ టీచర్ పేరు చూసి తన బాధ్యత కాకపోయినా తీసుకువెళ్లడానికి వచ్చాడు. ఆ సమయంలో తన ఆనందానికి అవధుల్లేవనీ. అది ఉపాధ్యాయులకు మాత్రమే దక్కే అదృష్టమనీ చెబుతారు కృష్ణవేణి. ఈమెది ఏలూరు జిల్లా, జంగారెడ్డి గూడెం. అమ్మ పాలపర్తి శ్యామల, నాన్న నూకరాజు. నలుగురు తోబుట్టువులు. అమ్మానాన్నా చిన్న టిఫిన్ కొట్టు నడిపేవారు. తెల్లవారు ఝామునే లేచి అక్కడ పనిచేశాకే స్కూల్‌కి వెళ్లేవారు కృష్ణవేణి. తన కుటుంబాన్ని ఈ పరిస్థితుల నుంచి ఎలాగైనా బయటికి తీసుకురావాలన్న తపనతో శ్రద్ధగా చదివేవారు. ఆటల్లోనూ చురుగ్గా పాల్గొనేవారు. 'అప్పట్లో మావూళ్లో సరైన వైద్య సదుపాయాల్లేవు. మెడిసిన్ చేసి స్థానికులకు అండగా నిలవాలనుకునేదాన్ని. ఆర్థిక పరిస్థితుల కారణంగా సాధ్యపడలేదు. అగ్రికల్చర్ బిఎస్సీ లో సీటొచ్చినా ఫీజు కట్టలేకపోయా. ఆ బాధలో నేనుంటే.. 'అమ్మాయికి చదువెందుకు, పెళ్లిచేసి పంపేయాక'.. అనేవాళ్లు చుట్టుపక్కల వాళ్లు. నాన్న మాత్రం మా చదువుల విషయంలో రాజీపడలేదు. ఇది నా సమస్య మాత్రమే కాదు. సామాజిక రుగ్మత. దీన్ని ఎలాగైనా పరిష్కరిం చాల్సిందేనని ఉపాధ్యాయ వృత్తిని ఎంచుకున్నా. కెరియర్ మొత్తం విశాఖ చుట్టుపక్కల గ్రామీణ ప్రాంతాల్లో పనిచేశా. 80ల్లో బాల్య వివాహాలు ఎక్కువ. స్వచ్ఛంద సంస్థల సాయంతో చాలా పెళ్లిళ్ల ఆపగలిగా, పాఠశాల తరఫున అవగాహన కార్యక్రమాలూ చేపట్టా' అని గుర్తు చేసుకుంటారు కృష్ణవేణి. ప్రస్తుతం అగనంపూడి జెడ్పీ హైస్కూల్లో పని చేస్తున్నారు.

**సైన్స్ చదువులకు ప్రోత్సాహం.**

భర్త వెంకటరావు ఎల్ఐసి ఉద్యోగి. వీరికిద్దరు అమ్మాయిలు. ఈ సైన్స్ టీచర్.. నేషనల్ గ్రీన్ టీచర్‌గానూ శిక్షణ తీసుకున్నారు. పర్యావరణ పరిరక్షణ, స్కౌట్స్ అండ్ గైడ్స్ వైపూ విద్యార్థుల్ని ప్రోత్సహిస్తుంటారు. ఆర్థిక పరిస్థితి బాగాలేక ఈమె విద్యార్థుల్లో కొందరు చిన్నాచితకా పనులు చేస్తుంటారు. వాళ్లలో జీవితంలో పైకి రావాలన్న తపనా ఎక్కువ వారి ప్రత్యేకతను మిగతా పిల్లలకు చెబుతూ నైతిక విలువల్ని నేర్పుతుంటారు. అదే సమయంలో ఆ పిల్లల్లోనూ న్యూనతా భావం పోగొడతారు. ఇప్పటిదాకా పిల్లల్ని దాదాపు 100 సైన్స్ ఫెయిర్లలో పాల్గొనేలా చేశారు. వీళ్ల రాష్ట్ర, జాతీయస్థాయిలో ఎన్నో బహుమతులూ గెల్చుకున్నారు. స్టెమ్ సబ్జెక్టులవైను అమ్మాయిల్ని ప్రోత్సహించేందుకూ, మూఢనమ్మకాలు పోగొట్టేందుకూ వీటిలో ఎక్కువగా భాగం చేస్తారు.

రాష్ట్ర, జాతీయస్థాయిలో ఉత్త ఉపాధ్యాయురాలిగా, ఉత్తమ గ్రీన్ టీచర్‌గా ఎంపికయ్యా. వీటికంటే కూడా.. నా విద్యార్థులు లాయర్లు, డాక్టర్లు, టీచర్లుగా స్థిరపడ్డామని చెబుతుంటే వారి విజయాలే నాకు సంతృప్తినిస్తాయి. పిల్లల హృదయాల్లో నాటే నైతిక విలువలు, కష్టం, ప్రేరణ, విజయం. ఇవి చాలా ముఖ్యం. భవిష్యత్ తరాల్ని తీర్చిదిద్దే అమూల్యమైన అవకాశమీ వృత్తి. ❑



# మందారం విరబూయాలంటే..

**నర్సరీలో విరబూసిన మందార మొక్కలను చూస్తే చాలు.. వెంటనే ఇంటికి తెచ్చి మురిసిపోతారు మహిళలు. తీరా నెలరోజులకే దానికున్న మొగ్గలన్నీ రాలిపోతుంటాయి. ఇలాకాకుండా ఏడాదంతా మందారం విరమూస్తూ తోటకు కళ తేవాలంటే నిపుణులు కొన్ని చిట్కాలు చెబుతున్నారు. ఇంట్లో తయారుచేసే సహజ సిద్ధమైన ఎరువులతోనే పెంచడమెలాగో వివరిస్తున్నారు.**



మందారంలో మొగ్గ లేదా చిగుర్ల వద్ద పురుగుపట్టే ఆస్కారం ఎక్కువ. చీడపట్టే ముదు ఆ ప్రాంతమంతా చీమలెక్కువగా కనిపిస్తాయి. వెంటనే ఆ కాండం, చిగుర్లు లేదా మొగ్గల వద్ద కత్తెరతో కట్‌చేసి దాన్నంతా ఒక కాగితం లేదా కవరులో ఉంచి తోటకు దూరంగా తీసుకెళ్లి పడేయాలి. ఈ చీడను వెంటనే నియంత్రించకపోతే మిగతా మొక్కలకూ సోకే ప్రమాదం ఉంది. రెండు చెంచాల పసుపు, కప్పు వెల్లుల్లి రెబ్బలకు రెండు కప్పుల నీటిని కలిపి బాగా మరిగించాలి. ఈ మిశ్రమాన్ని చల్లార్చిన మొక్కలపై చల్లితే చీడ తగ్గుఉంది. పాత్రలు కడగడానికి వినియోగించే డిష్‌వాష్ లిక్విడ్ సోపులో చెంచా వెజిటబుల్ ఆయిల్ కలిపి స్ప్రే చేసినా చీడ దూరమవుతుంది.

**ఎరువులు..** తోటలో ఓ పక్కఆ రెండు గోతులు తీసి, ఒకదాంట్లో వంటింటి వ్యర్థాలు, మధ్యలో పుల్లని మజ్జిగ, పేడ, బెల్లం నీళ్లు వంటివి పోస్తూ ఉండాలి. మొదటిది నిండిన వెంటనే మట్టితో మూసేయాలి. తర్వాత రెండోదాని నింపడం మొదలుపెట్టాలి. ఇది నిండేలోపు మొదటి దాంట్లో సేంద్రియ ఎరువు తయారవుతుంది.

దీన్ని మందార మొక్కల మొదళ్లలో వేస్తే, పోషకాలు అంది, ఆరోగ్యంగా ఎదుగుతాయి. ఉడికించినవి కాకుండా తాజా కోడిగుడ్ల పెంకులను ఎండబెట్టి మెత్తని పొడిగా చేయాలి. దీనికి ఎండిన అరటిపండు తొక్కల ఒపడిని కలపాలి. ఈ మిశ్రమాన్ని మొక్కల మొదళ్లలో వేస్తే మొక్కలకు బలం చేకూరి, మొగ్గలు రాలే సమస్య ఉండదు. ❑

# పండగలవేళ బహుమతులా !

**ఈ దీపాల పండగని వెలుగులతో నిర్వహించు కోవడమే కాదు.. బహుమతుల్ని ఇచ్చి పుచ్చుకోవడమూ చాలామందికి ఆనవాయితీ. సమస్యల్లా ఎంచుకోవడంతోనే.. మీదీ అదే సమస్యా? అయితే చదివేయండి.**

- అందరికీ ఒకటే అన్న ధోరణి వద్దు. ఏది ఇవ్వాలనుకున్నా.. వయసు, మీతో ఉన్న అనుబంధం ఈ రెండు అంశాల్నీ పరిగణనలోకి తీసుకోవాలి. ఉదాహరణకు-అమ్మానాన్న, అత్తమామలకు అనుకోండి. వారి అవసరాలు, ఆరోగ్యానికి సంబంధించినవి ఇవ్వొచ్చు. చిన్న పిల్లలైతే చాక్లెట్లు, కాస్త పెద్దవాళ్లైతే పుస్తకాలు లాంటివి ఇవొవ్వచ్చు. స్నేహితులు, సహోద్యోగుల్నీ ఒకే గాటన కట్టొద్దు. ఆఫీసు వాళ్లని హుందాగా ఉండేలా చూసుకోండి. స్నేహితులకు వాళ్ల అభిరుచికి తగ్గవి ఎంచుకుంటే వారి పట్ల మీ ప్రేమని తెలిపిన వారవుతారు.



- ఇక్కడ బడ్జెట్‌ని చూసుకోవడమూ ప్రధానమే. దీన్ని ముందే నిర్ణయించుకోండి. ఖరీదైనవే నాణ్యమైనవన్న అపోహ వద్దు. అవతలి వాళ్లకు ఉపయోగపడాలన్నదే మీ మంత్రమవ్వాలి. బోలెడు ఖర్చుపెట్టి ఓ వస్తువు కొన్నారు. చూడ్డానికి బాగున్నా షోకేసులోకి వెళ్లడమేగా! అదే ఉపయోగించుకునేలా ఇచ్చారనుకోండి. వాడిన ప్రతిసారీ మీరు తప్పక గుర్తొస్తారు.
- ఫ్యాషన్‌ను బాగా అనుసరించే వాళ్లనుకోండి. వాళ్లకి ఎంపిక చేయడం కాస్త సవాలే. అలాంటప్పుడు గిఫ్ట్‌కార్డ్‌లను ఇచ్చేయండి. ఈ-కామర్స్ సంస్థలన్నీ వీటిని అందిస్తున్నాయి. బడ్జెట్ దాటదు.. వాళ్లకి నచ్చినవి ఇచ్చామన్న సంతృప్తి మీకూ ఉంటుంది.
- గిఫ్ట్ అంటే బాగా కనిపించ ఏలా ప్యాక్ చేయడం తప్పనిసరి అనుకుంటున్నారా? మనకసలే పండగ పని ఎక్కువ. ప్యాకింగ్ పనీ పెట్టుకుంటే అదో అదనపు బరువు, బహుమతి అందుకున్న వాళ్లు నచ్చిందా లేదా అనేదే చూస్తారు. ఎంత బాగా ప్యాక్ చేశాని కాదు. సర్‌ప్రైజ్ ఇవ్వాలనుకుంటే తప్ప.. సొంత ప్యాకింగ్ పని పెట్టు కోకండి. ❑

## చెలి చిట్కా



బొంబాయి రవ్వతో ఉప్మా చేసేటప్పుడరు ఉండకట్టకుండా ఉండా లంటే నూకకి చెంచా నూనె పట్టిస్తే సరిపోతుంది.

# సెల్ రోటి

**కావలసినవి :** బియ్యం : 2 కప్పులు, పంచదార : 3 టేబుల్ స్పూన్లు, నెయ్యి : 3 టేబుల్ స్పూన్లు, పాలు : అరకప్పు, బియ్యప్పిండి : టేబుల్‌స్పూను (అవసరమైతేనే), నూనె : వేయించడానికి సరిపడా



**తయారుచేసే విధానం :** బియ్యం 8 గంటల పాటు నాన బెట్టాలి. నీళ్ల వంపేసి మిక్సీలో వేసి మెత్తగా రుబ్బాలి. అందులోని పంచదార, నెయ్యి, పాలు కూడా పోసి మరోసారి పేస్టులా మెత్తగా అయ్యేవరకూ రుబ్బాలి. పిండి మరీ జారుగా కాకుండా కాస్త గట్టిగానే ఉండాలి. రుబ్బిన తరవాత ఇంకా పలుచగా అనిపిస్తే బియ్యప్పిండి వేసి కలపాలి. 2. ఇప్పుడు పిండిని ప్లాస్టిక్ కవర్‌లో వేసి దానికి రంధ్రం పెట్టి కాస్త పెద్ద సైజు చెగోడీ మాదిరిగా గుండ్రంగా చుట్టినట్లుగా కాగిన నూనెలో వేసి బంగారువర్ణంలోకి మారే వరకూ వేయించి తీయాలి. ❑

# 'దీపం' లక్ష్మీ దేవి స్వరూపం

**ఇంటిల్లిపాదీ పిల్లలు,** పెద్దలు అందరూ కలిసి ఆనందోత్సాహాలతో కుల మతాలకు అతీతంగా జరుపుకునే పండగ దీపావళి. ఈ పండుగ భిన్నత్వంలో ఏకత్వాన్ని సూచిస్తుంది. పండుగలన్నీ సూర్యోదయంతో మొదలయితే, దీపావళి మాత్రం సూర్యాస్తమయంతో మొదల వుతుంది. దీపావళి రోజు లక్ష్మీపూజ ప్రధానం. అజ్ఞానాన్ని పారద్రోలే సాక్షాత్తు లక్ష్మీదేవి అని, దీపం వున్నా చోట జ్ఞాన సంపద ఉంటుందంటారు. అందుకే ఈ రోజున లక్ష్మీదేవిని భక్తి శ్రద్ధలతో పూజిస్తే సర్వ సంపదలు సిద్ధించి, సర్వ శుభాలు కలుగుతాయని నమ్ముతారు. అమావాస్య చీకట్లను పారద్రోలే దీపం లక్ష్మీదేవి ప్రతిరూపం. అందుకే దీపాలను తోరణాలుగా అమర్చి ఐశ్వర్య లక్ష్మిని పూజిస్తారు. ఏ శుభకార్యానికైన దీపం వెలిగించిన తర్వాతనే పూజ ప్రారంభిస్తాం.



ఈ దీపావళి ఇంట బయట దీపజ్యోతుల వరుసలతోనే దీపావళి ఆరంభమవుతుంది. దీపం వెలుగుకు, జ్ఞానానికి ప్రతీక. అమావాస్య చీకట్లను పారద్రోలుతూ ఇంటి ముందు, పూజా గృహంలో వెలిగే దీపాల వరసలు సర్వ శుభాలను అనుగ్రహిస్తాయి. దేశమంతా ఆనందోత్సాలతో జరుపుకునే దీపావళిని వెలుగుతోరణాలతో, వెలుగుతుచిమ్మే బాణాసందాతో ఘనంగా జరుపుకుంటాం. చెడు అనే చీకటిని పారద్రోలి, మంచి అనే వెలుగును నింపడమే ఈ పండగ యొక్క ముఖ్య ఉద్దేశ్యం. విజయానికి ప్రతీతగా ప్రతి ఇంటా చీకటిని పారద్రోలి వెలుగులను నింపి భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ మహాలక్ష్మిని ఆహ్వానిస్తాం. ఈ దివ్వకాంతుల ఈ మాసంలో మీ ఇంటిల్లిపాదికి సుఖశాంతులు, సిరిసంపదలు, మధురానుభూతులు మిగిల్చాలని మనసారా కోరుకుంటూ

**- కాయల నాగేంద్ర**

ఆధ్యాత్మికం

# సోషల్‌మీడియాపై ఏకాగ్రత..

**కొంతమంది అమ్మాయిలు అర్ధరాత్రి వరకు ఫోన్‌లోనే ఉంటుంది. రాత్రి పోస్ట్ చేసిన తమ ఫొటోలకు లైక్స్, కామెంట్స్ ఎన్ని ఉంటాయనే ఆత్రుత వాళ్ల పరగడుపునే ఫోన్‌కు అలవాటయేలా చేస్తుంది. ఇది క్రమంగా పలురకాల శారీరక, మానసిక అనారోగ్యాలకు దారితేసే ప్రమాదం ఉందంటున్నారు నిపుణులు. సోషల్ మీడియాకంటూ నిర్ణీత సమయాన్ని కేటాయించు కోవడమే దీనికి పరిష్కారం అంటున్నారు.**

ఉదయం నిద్రలేవడానికి ఫోన్‌లో కాకుండా గడియారంలో అలారం ఉండాలి. నిద్రలేచిన వెంటనే ఫోన్ చేతిలోకి తీసుకోనక్కర్లేదు. కిటికి లేదా బాల్కనీ నుంచి సూర్యోద యాన్ని చూస్తూ కప్పు గ్రీన్‌టీ లేదా వేడి కాఫీ తీసుకుంటే మనసంతా ఉల్లాసంగా మారు తుంది. పావుగంట వ్యాయా మానికి కేటాయించుకొని చిన్న చిన్న స్ట్రెచ్‌లు, లేదా కాసేపు నడక శారీరకంగా కొత్త శక్తి వచ్చినట్లుంటుంది. ఉత్సాహంగా రోజును ప్రారంభించి ఇంట్లో, ఆఫీస్‌లో ఆ రోజు చేయాల్సిన పనులు, బాధ్యతలను పూర్తిచేయడానికి ప్రణాళిక వేసుకోవచ్చు.



తొలగించి... ఫోన్‌లో కాల క్షేపానికి వినియో గించే అనవసరమైన యాప్స్‌ను తొల గించడం మంచిది. లేదంటే కాస్తంత సమయం దొరికినా ఫోన్‌లోకి వెళ్లిపోయే అలవాటు మానలేరు. ముందుగా యాప్స్ తొలగిస్తేసోషల్‌మీడియాపై ఏకాగ్రత తగ్గుతుంది. ఫిట్‌నెస్, పర్సనాలిటీ డెవలప్‌మెంటల్, పోషకాహారం వంటి అంశాలపై అవగాహన కలిగించే ప్రయోజనకరమైన కొన్నింటిని మాత్రం ఎంపిక చేసి, మిగతావాటిని తొలగించాలి. ఈ యాప్స్‌ను వీక్షించడానికి రోజులో ఎంతోకొంత నిర్ణీత సమయాన్ని మాత్రమే కేటాయించుకోవాలి.

**బదులుగా..** రోజులో ఎన్ని గంటలు ఫోన్‌కు వృథా చేస్తున్నామో గుర్తించాలి. మన విలువైన సమయాన్నే కాదు. శరీరంలోని శక్తినీ హరించి మానసిక ఒత్తిడిని పెంచే సోషల్‌మీడియాను పక్కనపెట్టి, ఏదైనా కొత్త అలవాటు లేదా యాక్టివిటీకి ఆ టైంను బదిలీ చేయాలి. కొత్త భాష నేర్చుకోవడం, కెరియర్ కోసం ఏదైనా కోర్సు చేయడం, తోటపని, మనసుకు నిచ్చన పుస్తకం చదవం వంటివి ఎంచుకుంటే కొత్త నైపుణ్యాలతో భవిష్యత్తును తీర్చిదిద్దుకోవచ్చు. సమయం విలువ గురించి అవగాహన కలిగించే పుస్తకాలు చదివితే సోషల్‌మీడియా ప్రభావం నుంచి బయటప డొచ్చు. కుటుంబం.. ఈ సమయాన్ని కుటుంబం కోసం కేటాయిస్తే అనుబంధాలు బలపడతాయి. ఇంటిల్లిపాదీ కలిసి సరదాగా మాట్లాడుతూ భోజనం చేయడం, ఏదైనా సమస్య ఉంటే కలిసి పరిష్కరించుకోవడం, వారాంతాల్లో పర్యటకప్రాంతాలకు వెళ్లిరావడం వంటివి మానసికానందాన్ని అందిస్తాయి. ఒంటరిగా కాకుండా అందరం కలిసి అన్న భావన మనసులో నిండుతుంది. శరీరంలో వృథాను డిటాక్స్ చేసేలా సోషల్‌మీడియానూ చేయగలిగితే ఆరోగ్యంగా ఉండొచ్చు. ❑

